ఆదివారం
SUNDAY
18-10-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 110

జగిత్యాల JAGITIAL || పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

EVARTHALU

దినపత్రిక



సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు





పిల్లలకూ ఇంటర్నెట్ హక్కు

వయసు ఆధారిత నిషేధానికి 'సుప్రీం' నో


ఇంటర్నెట్‌ను వినియోగించే హక్కు పిల్లలతో సహా ప్రతి ఒక్క వ్యక్తికి ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 19(1)(బీ) ప్రకారం ఇంటర్నెట్ వాడటం ప్రాథమిక హక్కు అని కోర్టు పేర్కొంది. పిల్లల వయసు ఆధారంగా ఇంటర్నెట్ వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించేందుకు నిరాకరించింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తాజాగా ఈ వ్యాఖ్యలు చేసింది.

న్యూఢిల్లీ: సోషల్ మీడియా వేదికల్లో పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ వ్యాప్తిని అరికట్టడంలో నిర్లక్ష్యం జరుగుతోందన్న పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ అభిప్రాయాన్ని వెల్లడించింది. పిల్లల భద్రతతో పాటు వారి స్వేచ్ఛ కూడా ముఖ్యమేనని కోర్టు పేర్కొంది. ఇంటర్నెట్‌పై నిషేధం విధించడం కంటే తల్లిదండ్రుల నియంత్రణలు, సోషల్ మీడియాలో చైల్డ్ మోడ్, అభ్యంతరకర కంటెంట్ తొలగింపు వంటి చర్యలను కఠినంగా అమలు తరువాయి 2 వ పేజీలో...

మేం కూడా ధర్నాకు దిగుతాం

ఢిల్లీ హైకోర్టు దగ్గర పాదచారుల కోసం సరైన ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్‌లు లేకపోవడం ఏంటి? వచ్చే విచారణలోగా పనులు పూర్తి చేయకపోతే మేమే స్వయంగా వెళ్లి హైకోర్టు గేటు ముందు ధర్నాకు కూర్చుంటాం. పని పూర్తయ్యేదాకా ఇంటికి వెళ్లం. సురక్షితమైన ఫుట్‌పాత్‌లు ఉండటం ఆర్టికల్ 21, 19(1)(డీ) ప్రకారం ప్రజల ప్రాథమిక హక్కు

- సుప్రీం కోర్టు





బిస్కెట్ల తయారీలో తవుడు!

తయారీ సంస్థపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన చర్యలు

దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన 'ప్రియగోల్డ్' బిస్కెట్ల తయారీలో పశువుల దాణా వినియోగిస్తున్నట్లు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంచలన ప్రకటన చేసింది. ఈ తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందుకు గాను, ప్రియగోల్డ్ తయారీ సంస్థ అయిన 'సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో లిమిటెడ్'పై ప్రాసిక్యూషన్ ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు శనివారం వెల్లడించింది.

న్యూఢిల్లీ: ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో కంపెనీ తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో, 'పశువుల దాణాకు తరువాయి 2 వ పేజీలో...



తెలంగాణ బతుకు.. 'చిత్రం'

టాలీవుడ్‌కు తెలంగాణే కొత్త ఊపిరి.. కథకు ప్రాణంగా ఇక్కడి యాస, భాష

వెండితెరను షేక్ చేస్తున్న జానపదం.. అస్తిత్వమే నేటి కమర్షియల్ ఫార్ములా

యాస కాదు.. అస్తిత్వం!
పాట కాదు.. పల్లె గుండె చప్పుడు!
ఒకప్పుడు వెండితెర అంచులకు పరిమితం
ఇప్పుడు కథను నడిపించే చోదక శక్తి!



(ఈవార్తలు - సండే స్టోరీ)

ఒకప్పుడు తెలుగు సినిమా తెరపై తెలంగాణ యాస వినిపిస్తే చాలు.. ఆ పాత్రను హాస్యానికి పరిమితం చేసేవారు. తెలంగాణ భాషలో మాట్లాడే మనిషిని అమాయకుడిగానో, వెనుకబడిన వాడిగానో చూపించేవారు. పల్లె పదాలను పరిహాసానికి వాడేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. తెలంగాణ యాసే కథకు బలం అవుతోంది. తెలంగాణ పాటే సినిమాకు ఊపిరి పోస్తోంది. తెలంగాణ నేల, ఇక్కడి మనుషులు, వారి పోరాటాలు, భావోద్వేగాలు, సంస్కృతి.. వెండితెరపై కథను ముందుకు నడిపించే ప్రధాన శక్తులుగా మారుతున్నాయి. భోగి సినిమాలో తెలంగాణ మట్టి తరువాయి 2 వ పేజీలో...

నా తెలంగాణం.. సింగిడి వనం!

గునుగు పూల గుబాళింపులు..
తంగేడు పూల తళుకులీనులు..
చామంతుల చిరునవ్వులు..
పట్టుకుచ్చుల పరవశాలు..

బతుకమ్మ ఉయ్యాలో జానపద జావళి..
గుండెగుండెలో ఆత్మీయతల లోగిలి..
గడపగడపలో పండుగ హడావుడి..
అక్కాచెల్లెళ్ల ఆనందాల సింగిడి..
చప్పట్ల తాళానికి అడుగుల సవ్వడి..
చెరువుల నిండా పూల సందడి..

సద్దుల సింగారంలో సంతోషాలు విరియాలి..
బతుకమ్మ దీవెనలతో బతుకులు వెలగాలి..
చెరువులు జలకళతో జిగేలుమనాలి..
పాడిపంటలతో పల్లెలు కళకళలాడాలి..
ఇంటింటా సిరిసంపదలు వెల్లివిరియాలి..
ఆశల సింగిడి ఆకాశాన మెరవాలి..
ఆడపడుచులు సంబురంతో మురవాలి..!

తెలంగాణ ఆడపడుచులందరికీ
సద్దుల బతుకమ్మ
పండుగ శుభాకాంక్షలు

- గంగాధర్ బొమ్మకంటి
చైర్మన్ 'ఈవార్తలు' తెలుగు దినపత్రిక

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

(గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,766
వెండి (కిలో):	రూ.2,40,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,965

విశ్వవాణి



చికిత్సకు లొంగని మెదడు క్యాన్సర్లతో బాధపడుతున్న పిల్లలు, యువతకు రోగనిరోధక చికిత్స ద్వారా కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. మొత్తం 33 మంది పిల్లలు, యువకులపై తొలిదశ వైద్య పరీక్షలో భాగంగా కణితులను గుర్తించి దాడి చేసే రోగనిరోధక కణాలతో సరికొత్త చికిత్సను పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ విధానంలో రోగుల రోగనిరోధక టీ కణాలకు జన్యు మార్పులు చేయకుండా, కణితుల్లో సాధారణంగా కనిపించే మూడు ప్రొటీన్లను గుర్తించగల సహజ రోగనిరోధక కణాలను వేరు చేసి, వాటి సంఖ్యను పెంచారు. అనంతరం వాటిని రక్తప్రవాహం ద్వారా శరీరంలోకి ప్రవేశపెట్టారు. ఇది ఫలితాన్ని ఇచ్చింది. అయితే, ప్రస్తుతం ఈ పరీక్షలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి.



తొక్కిసలాటలో 17 మంది మృతి

కోల్‌కతాలోని దుర్గా మండపం వద్ద ఘటన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని చోర్ బగాన్ సర్వజనీన్ దుర్గామాత మండపం వద్ద తొక్కిసలాట జరగడంతో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. తక్షణమే అప్రమత్తమైన పోలీసులు, ఫైర్ సిబ్బంది, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తరువాయి 2 వ పేజీలో...



లైటింగ్ క్రేన్ కూలి ఇద్దరి దుర్మరణం

దాండియా ఆడుతుండగా ఘటన

ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రమాదం

రంగారెడ్డి, అక్టోబర్ 17 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ పరిధిలోని నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన దాండియా వేడుకల్లో ఘోర ప్రమాదం జరిగింది. శనివారం సాయంత్రం విద్యార్థులంతా దాండియా నృత్యాలు చేస్తూ వేడుకల్లో మునిగిపోయిన సమయంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలుముకుంది. అకస్మాత్తుగా వీచిన

చెరుకుతో ఇథనాల్ తయారీ బంద్

చక్కెర ధరల నేపథ్యంలో కేంద్రం నిర్ణయం



ఎల్ నినో భయాందోళనల వేళ దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలకు అడ్డుకట్ట వేసేందుకు, స్థానిక మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెరుకు నుంచి ఇథనాల్‌ను తయారు చేసే విధానానికి తాత్కాలికంగా అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. చక్కెరతో పాటు చెరుకు రసం, షుగర్ సిరప్, బీ-హెవీ మొలాసిస్ వాడకాన్ని ప్రభుత్వం విషేధించింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా షుగర్ ధరలు అదుపులోకి రానున్నాయి.

న్యూఢిల్లీ: వచ్చే నవంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న 2026-27 సరఫరా సంవత్సరానికి సంబంధించి ఓఎంసీలు కొత్త ఎథనాల్ టెండర్లను జారీ చేశాయి. ఈ తాజా టెండర్లలో చెరకు రసం, షుగర్ సిరప్, బి-హెవీ మొలాసిస్ వంటి చెరకు ఆధారిత ముడిసరుకులకు పూర్తిగా మినహాయింపునిచ్చాయి. గత చక్కెర సరఫరా సీజన్‌లో దేశీయ అవసరాలకు సరిపడా చక్కెర ఉత్పత్తి చేయడమే సవాలుగా మారింది. దేశంలో ఏటా సుమారు 280 నుంచి 285 లక్షల టన్నుల చక్కెర అవసరమవుతుండగా, గత సీజన్‌లో నికర ఉత్పత్తి దేశీయ డిమాండ్‌కు కొద్దిమేరకే సరిపోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. దీంతో రాబోయే పండుగల సీజన్‌లో చక్కెర కొరత ఏర్పడకుండా నిల్వలను పెంచడంపై కేంద్రం దృష్టి సారించినట్లు తరువాయి 2 వ పేజీలో...

సీఆర్పీఎఫ్ జవాన్లకు వేగంగా పదోన్నతులు

లాన్స్ నాయక్, నాయక్ ర్యాంకుల పునరుద్ధరణకు యోచన

30 ఏళ్ల క్రితం రద్దయిన ర్యాంకులను మళ్లీ తెచ్చేందుకు కసరత్తు

త్వరలో దళంలో చేరనున్న అగ్నివీరులకు లబ్ధి చేకూర్చే అవకాశం



న్యూఢిల్లీ: కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం (సీఆర్పీఎఫ్) జవాన్ల పదోన్నతుల్లో నెలకొన్న తీవ్ర జాప్యాన్ని నివారించేందుకు ఒక కీలక ప్రతిపాదనను సిద్ధం చేసింది. సుమారు మూడు దశాబ్దాల క్రితం రద్దు చేసిన 'లాన్స్ నాయక్', 'నాయక్' ర్యాంకులను తిరిగి ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, కానిస్టేబుల్ స్థాయి నుంచి పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న లక్షలాది మంది సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. ఈ ప్రతిపాదనపై సిబ్బంది అభిప్రాయాలను తరువాయి 2 వ పేజీలో...



భారత్‌పై 100 శాతం సుంకాలు స్టాప్: ట్రంప్

వాషింగ్టన్: రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే భారత్ సహా ఇతర దేశాలపై 100 శాతం సుంకాలను విధించేందుకు వీలు కల్పించే చట్టాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికా ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తరువాయి 2 వ పేజీలో...

శిశువుల ఆహారంలో ఫ్రక్టోజ్, సుక్రోజ్ వద్దు!

ఆహార సంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు



న్యూఢిల్లీ: ఆరు నెలల వరకు వయసున్న శిశువులకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లను కలపడాన్ని నిషేధించాలని 'భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్స్ ఫర్ ఇన్‌ఫాంట్ న్యూట్రిషన్) రెగ్యులేషన్స్, 2020'కు సవరణ ముసాయిదాను ప్రచురించింది. పసితనంలోనే అదనపు చక్కెరలు తీసుకోవడాన్ని తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు
17.10.2026

మేషం: ఉద్యోగాలలో అధికారుల ఆగ్రహానికి గురి అవుతారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులు కష్టసాధ్యంతో పూర్తవుతాయి. సంతాన విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలలో పెద్దలతో మాటపట్టింపులు తప్పవు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

వృషభం: వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసి వస్తాయి. నూతన ఉద్యోగ అవకాశలు అందుతాయి. అవసరానికి ఇతరుల నుండి ధన సహాయం అందుతుంది. సోదరులతో మనస్పర్థలు తొలగుతాయి. గృహ వాతావరణం సంతోషకరంగా ఉంటుంది.

మిథునం: నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. నేత్ర సంభంధిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. నూతన వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగులకు అధికారుల నుండి సమస్యలు తప్పవు. దైవ చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గంధరగోళంగా ఉంటుంది.

కర్కాటకం: వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. సంతాన విద్యా ఉద్యోగ విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి.

సింహం: ఉదర సంబంధ అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది.

కన్య: బంధు మిత్రుల సహాయ సహకారాలతో పనులు పూర్తి చేస్తారు. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తాయి. గృహమున శుభకార్య విషయమై ప్రస్తావన వస్తుంది. సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది.

తుల: ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలతో ముందుకు సాగడం మంచిది. బంధువులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగమున చాలాకాలంగా వేదిస్తున్న సమస్యలు పరిష్కరించుకుంటారు. వ్యాపార వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు విఫలమౌతాయి. చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఇతరుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది.

ధనస్సు: నిరుద్యోగులకు అధిక కష్టం మీద అల్ప ఫలితం పొందుతారు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఉద్యోగాలలో బాధ్యతలు మరింత అధికమౌతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. సంతాన వ్యవహారాలు సమస్యాత్మకంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

మకరం: నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు కలసివస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

కుంభం: వ్యాపారాలలో శత్రు సమస్యలు నుండి తెలివిగా బయటపడతారు. ఆర్థిక ఆలోచనలు అనుకూలంగా సాగుతాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. బంధు మిత్రులతో సఖ్యత పెరుగుతుంది.

మీనం: ఉద్యోగమున మంచి పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు. మంచి ఆలోచన జ్ఞానంతో ముందుకు సాగుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూరప్రాంతాల బందు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి.

తెలంగాణ బతుకు.. 'చిత్రం'

మొదటి పేజీ తరువాయి

వాసన పలికించే పాటలు.. ప్యారడైజ్‌లో తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిధ్వనించే వాదం.. ఇలా సినిమా ఏదైనా తెలంగాణ ఆనవాళ్లు ప్రేక్షకులను పలకరిస్తున్నాయి. ఇది కేవలం ఒక ప్రాంతపు భాషకు దక్కిన గుర్తింపు మాత్రమే కాదు.. తెలుగు సినిమా కథనంలో తెలంగాణ తన స్థానాన్ని నిర్వచించుకుంటున్న పరిణామం.

యాస నుంచి అస్తిత్వం వరకు..

తెలంగాణ ఉద్యమం రాష్ట్ర సాధనతో ముగిసిపోలేదు. ఆ ఉద్యమం పుట్టించిన ఆత్మగౌరవ భావన సాహిత్యంలో, పాటల్లో, జానపద కళల్లో, ఇప్పుడు సినిమాల్లోనూ కొనసాగుతోంది. తెలంగాణ పలుకుబడి, పల్లె జీవితం, బతుకమ్మ, బోనాలు, జాతరలు, జానపద గీతాలు, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలు.. ఇవన్నీ ఒకప్పుడు ప్రాంతీయ అంశాలుగా మాత్రమే పరిగణించబడేవి. ఇప్పుడు అవే కథలకు కొత్తదనాన్ని, పాత్రలకు సహజత్వాన్ని అందిస్తున్నాయి. తెలంగాణ మనిషి మాట్లాడే మాటలోనే ఒక ప్రత్యేకమైన జీవన తత్వం ఉంటుంది. అతడి హాస్యంలో వెటకారం ఉంటుంది. బాధలో ఆవేదన ఉంటుంది. ఎదురుదెబ్బ తగిలినా నిలబడే ధైర్యం ఉంటుంది. అన్యాయాన్ని ప్రశ్నించే తెగువ ఉంటుంది. ఈ లక్షణాలను అర్థం చేసుకుని తెరపై ఆవిష్కరించినప్పుడు పాత్రలు కృత్రిమంగా అనిపించవు. ప్రేక్షకుడికి తన పక్కింటి మనిషినో, తన ఊరి వ్యక్తినో తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది.

పాటలో మట్టి.. మాటలో మనిషి!

తెలంగాణ పాటకు ఉన్న ప్రత్యేకత దాని పదాల్లోనే కాదు.. దాని వెనుక ఉన్న జీవితంలోనూ ఉంది. వ్యవసాయ పనుల్లో వినిపించే తాళం, కూలీల కష్టంలో పుట్టే బాణీ, జాతరల్లో ఉప్పొంగే ఉత్సాహం, ప్రేమలో పలికే పల్లె పలుకులు, పోరాటంలో మార్మోగే నినాదాలు.. ఇవన్నీ తెలంగాణ పాటను ఒక జీవన వ్యక్తీకరణగా నిలబెడతాయి. సినిమాలో ఇలాంటి పాట వినిపించినప్పుడు అది కేవలం వినోదాన్ని అందించదు. కథ జరుగుతున్న నేలను పరిచయం చేస్తుంది. పాత్రల నేపథ్యాన్ని చెబుతుంది. వారి సామాజిక పరిస్థితులను, భావోద్వేగాలను ప్రేక్షకుడికి చేరవేస్తుంది. అందుకే తెలంగాణ జీవనాన్ని సహజంగా ప్రతిబింబించే పాటలు సినిమా నుంచి బయటకు వచ్చి ప్రజల నోళ్లలో నానుతున్నాయి. అయితే తెలంగాణ పాటను తెరపై వినిపించడానికీ, తెలంగాణ ఆత్మను పాటలో పలికించడానికీ తేడా ఉంది. కొన్ని స్థానిక పదాలను చేర్చడం, జానపద వాద్యాలను ఉపయోగించడం మాత్రమే తెలంగాణదనాన్ని సృష్టించలేవు. ఆ పాటలో ఇక్కడి జీవితం, భాషలోని సహజత్వం, భావంలోని నిజాయితీ కలిసినప్పుడే అది ప్రేక్షకుడి మనసుకు చేరుతుంది. భోగి, ప్యారడైజ్ వంటి చిత్రాల ప్రస్తావనతో తెలంగాణ ఉనికి సినిమాల్లో ఎలా విభిన్న రూపాల్లో వ్యక్తమవుతోందన్న చర్చ ముందుకొస్తోంది. ఒకచోట తెలంగాణ పాట, పలుకుబడి, సంస్కృతి ప్రేక్షకుడిని ఆకట్టుకుంటే.. మరోచోట తెలంగాణ అస్తిత్వం, సామాజిక నేపథ్యం, ప్రాంతీయ స్వరం కథలో భాగమవుతున్నాయి. ఈ రెండు వ్యక్తీకరణలూ ఒకే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి: తెలంగాణ ఇప్పుడు కేవలం కథకు నేపథ్యం కాదు.. కథ చెప్పే భాషలో భాగం. సినిమాకు పాట అవసరం. పాత్రకు భాష అవసరం. కథకు సామాజిక నేపథ్యం అవసరం. ఈ మూడింటినీ తెలంగాణ తనదైన శైలిలో అందించగలదు.

తెలంగాణ లేకుంటే వెలితి

టాలీవుడ్‌లో తెలంగాణ భాషకు, సంస్కృతికి ప్రాధాన్యం పెరుగుతున్న మాట వాస్తవం. ముఖ్యంగా తెలంగాణ నేపథ్యంతో రూపొందే కథల్లో స్థానిక యాస పాత్రలకు సహజత్వాన్ని అందిస్తోంది. తెలంగాణకు చెందిన కళాకారులు, రచయితలు, గేయరచయితలు, జానపద గాయకుల సృజన కూడా ఈ మార్పులో కీలక పాత్ర పోషిస్తోంది. తెలంగాణ పదాలు, సామెతలు, పలుకుబడులు ప్రేక్షకులకు కొత్తగా వినిపించేవి కావు. అవి కోట్లాది మంది రోజువారీ జీవితంలో భాగం. ఆ మాటలను తెరపై ఉన్నది ఉన్నట్టుగా వినిపించినప్పుడు ప్రేక్షకుడికి తన భాషకు గుర్తింపు లభించిందన్న భావన కలుగుతుంది. గతంలో ప్రధాన స్రవంతి సినిమాల్లో తక్కువగా కనిపించిన ప్రాంతీయ జీవితం ఇప్పుడు మరింత స్పష్టంగా తెరపైకి రావడం కూడా ఈ ఆదరణకు కారణం. ప్రాంతీయ భాష, జానపద సంగీతం, స్థానిక సంస్కృతికి పెరుగుతున్న



ఆదరణతో వాటిని సినిమాల్లో వినియోగించాలనే ఆసక్తి కూడా పెరుగుతుంది. ఇది సహజమైన పరిణామమే. అయితే తెలంగాణదనాన్ని కేవలం మార్కెట్ ఆకర్షణగా మార్చితే అసలు ప్రయోజనం దెబ్బతింటుంది. తెలంగాణ యాసలో మాట్లాడే పాత్రకు హాస్యాన్ని మాత్రమే అంటగట్టడం, పల్లె మనుషులను మూసపాత్రలుగా చూపించడం, జానపద గీతాన్ని సందర్భంతో సంబంధం లేకుండా చొప్పించడం.. ఇవన్నీ ఆ సంస్కృతిని పైపైన ఉపయోగించుకున్నట్టే అవుతుంది. తెలంగాణ ప్రజల జీవితాల్లోని వైవిధ్యం, వారి ఆలోచనలు, ఆశలు, ఆకాంక్షలు, సంఘర్షణలు కూడా తెరపైకి రావాలి. రైతు, కార్మికుడు, విద్యార్థి, మహిళ, కళాకారుడు, వలసజీవి.. ఇలా విభిన్న జీవితాలకు కథల్లో చోటు దక్కాలి. తెలంగాణ భాషను యథాతథంగా ఉపయోగించడం ఎంత ముఖ్యమో, దానిలోని భావాన్ని అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం.

వాస్తవికతకు పట్టాభిషేకం

తెలంగాణ నేపథ్య కథల్లో గ్లోరిఫికేషన్ కంటే రియాలిటీ ఎక్కువ ఉంటుంది. అక్కడి మనుషుల పట్టింపులు, అలకలు, బంధాలు, కట్టుబాట్లు చాలా సహజంగా ఉంటాయి. ప్యారడైజ్ లాంటి సినిమాల్లో కనిపించే తెలంగాణ వాదం, అక్కడి మనుషుల అస్తిత్వ పోరాటాన్ని, వారి జీవన శైలిని ప్రతిబింబిస్తుంది. సినిమాటిక్ లిబర్టీ పేరిట మ్యాజిక్కులు చేయకుండా, ఉన్నది ఉన్నట్లుగా చూపించడం వల్లే ఈ కథలు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. తెలంగాణ మాండలికంలో అంతులేని ఆత్మీయత, సహజత్వం ఉంటాయి. అందులోని పదాలు నేరుగా ప్రేక్షకుల హృదయాలకు హత్తుకుంటాయి. అందుకే నేటి దర్శకులు కృత్రిమమైన డైలాగుల కంటే, మట్టిలోంచి పుట్టిన సహజమైన తెలంగాణ యాసకే పెద్ద పీట వేస్తున్నారు.

వెండితెరపై కొనసాగాల్సిన తెలంగాణ స్వరం

తెలంగాణ పాట ఒక ప్రాంతపు సంస్కృతిని పరిచయం చేస్తుంది. తెలంగాణ యాస ఒక మనిషి జీవితాన్ని కళ్లకు కడుతుంది. తెలంగాణ వాదం ఆత్మగౌరవాన్ని గుర్తుచేస్తుంది. ఈ మూడూ కలిసినప్పుడు సినిమా కేవలం వినోదంగా మిగలకుండా సమాజంలోని ఒక జీవన వాస్తవికతకు అద్దం పడుతుంది. ఒకప్పుడు తెరపై తన మాటను తానే వెతుక్కున్న తెలంగాణ.. ఇప్పుడు తన గొంతుతోనే కథలు చెప్పే దశకు చేరుకుంటోంది. ఇది ఒక్క సినిమా సాధించిన మార్పు కాదు. భాషకు, స్థానిక సంస్కృతికి, ప్రాంతీయ అనుభవాలకు పెరుగుతున్న గుర్తింపులో భాగం. అయితే ఈ ప్రయాణం పాటలతోనో, కొన్ని తెలంగాణ పదాలతోనో ఆగిపోకూడదు. తెలంగాణ చరిత్ర, సామాజిక ఉద్యమాలు, పల్లె జీవితాలు, నగర విస్తరణ, వలసలు, వ్యవసాయ సంక్షోభం, యువత ఆకాంక్షలు.. మరెన్నో కథలు వెండితెరపైకి రావాలి. తెలంగాణను అలంకరణగా కాకుండా కథలో అంతర్భాగంగా చూపించాలి.

"తెలంగాణ అనేది ఒక యాస మాత్రమే కాదు.. ఒక జీవన విధానం. ఒక పాట మాత్రమే కాదు.. తరతరాల అనుభవం. ఒక ప్రాంతం మాత్రమే కాదు.. తన అస్తిత్వాన్ని చాటుకుంటున్న సమాజం. ఇది కేవలం ఒక ట్రెండ్ కాదు.. దశాబ్దాలుగా వెండితెరపై నిర్లక్ష్యానికి గురైన ఒక సుసంపన్నమైన సంస్కృతి సాధించిన ఘన విజయం. తెలంగాణ పల్లెల్లో దాగిన కథలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఆ మట్టి వాసన, ఆ స్వచ్ఛమైన యాస, ఆ గుండెను పిండేసే పాట.. రాబోయే కాలంలో తెలుగు సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అస్తిత్వమే ఇప్పుడు అసలైన కమర్షియల్ ఫార్ములా అని ఈ సినిమాలు నిరూపిస్తున్నాయి."

సీఆర్పీఎఫ్ జవాన్లకు వేగంగా పదోన్నతులు

మొదటి పేజీ తరువాయి

సేకరించేందుకు సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం తక్షణ చర్యలు చేపట్టింది. కేవలం రెండు రోజుల్లో వ్యవధిలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని యూనిట్లలో 'సైనిక్ సమ్మేళన్'లు నిర్వహించి, జవాన్ల ఫీడ్‌బ్యాక్ సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 3.25 లక్షల మంది సిబ్బంది కలిగిన సీఆర్పీఎఫ్‌లో ఈ ప్రతిపాదనపై ప్రస్తుతం విస్తృతస్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సీఆర్పీఎఫ్‌లో ఒక కానిస్టేబుల్ తన మొదటి పదోన్నతిని (హెడ్ కానిస్టేబుల్‌గా) అందుకోవడానికి సగటున 22 నుంచి 25 ఏళ్ల సమయం పడుతోంది. ఈ సుదీర్ఘ నిరీక్షణ సిబ్బందిలో నైరాశ్యం నింపుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల మధ్య లాన్స్ నాయక్, నాయక్ అనే రెండు అదనపు ర్యాంకులను సృష్టించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని అధికారులు భావిస్తున్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 1997లో ఈ ర్యాంకులను రద్దు చేసి, వాటిని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల్లో విలీనం చేశారు.

అయితే, భారత సైన్యంలో ఈ ర్యాంకులు ఇప్పటికీ కొనసాగుతుండటం గమనార్హం. ఈ ఏడాది చివరి నాటికి సైన్యంలో నాలుగేళ్ల సేవలు పూర్తిచేసుకుని మొదటి బ్యాచ్ అగ్నివీరులు పదవీ విరమణ చేయనున్నారు. వీరు కేంద్ర సాయుధ బలగాల్లో చేరేందుకు అర్హత కలిగి ఉంటారు. ఈ తరుణంలో సీఆర్పీఎఫ్‌లో పదోన్నతులు వేగంగా లభిస్తాయనే భరోసా కల్పించడం ద్వారా, నైపుణ్యం గల అగ్నివీరులను పెద్ద సంఖ్యలో ఆకర్షించవచ్చని బలగం భావిస్తోంది. అయితే, ఈ ప్రతిపాదనపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. నిర్ణీత కాల పరిమితిలో పదోన్నతులు కల్పిస్తేనే ఈ సంస్కరణలకు నిజమైన ఫలితం ఉంటుందని పారామిలిటరీ మాజీ సిబ్బంది సంఘం నేత ఒకరు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, కొత్త ర్యాంకుల వల్ల బెటాలియన్ క్రమశిక్షణకు, ఆపరేషనల్ విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని ఓ సీనియర్ కమాండెంట్ పేర్కొన్నారు.



భారత్‌పై 100 శాతం సుంకాలు స్టాప్: ట్రంప్

మొదటి పేజీ తరువాయి

యూఎస్ కాంగ్రెస్‌కు తెలిపారు. సుంకాలు విధించే ఈ బిల్లుకు సెప్టెంబర్ 18న ట్రంప్ ఆమోదం తెలిపి, సంతకం చేసినప్పటికీ సుంకాలు స్వయంచాలకంగా అమలులోకి రాలేదు. ఈ చట్టం అమలుకు ముందు 12 నెలల కాలంలో రష్యా నుంచి అత్యధిక మొత్తంలో ముడిచమురు, న్యాచురల్ గ్యాస్‌ను దిగుమతి చేసుకునే ఐదు దేశాలు చట్టం అమలులోకి వచ్చిన 30 రోజుల తర్వాత కూడా వాటిని దిగుమతి చేసుకుంటే 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రతిపాదించారు.

లైటింగ్ క్రేన్ కూలి ఇద్దరి దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

బలమైన ఈదురుగాలుల ధాటికి ఈవెంట్ కోసం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన లైటింగ్ క్రేన్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించినట్లు సమాచారం. మరో 25 మందికిపైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈవెంట్‌లో విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా బ్లాక్స్ ఏర్పాటు చేయగా, ఈ భారీ లైటింగ్ క్రేన్ నేరుగా విద్యార్థినులు ఉన్న వైపు కూలిపడింది. దీంతో అక్కడ ఒక్కసారిగా తొక్కిసలాట, హాహాకారాలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే కాలేజీ యాజమాన్యం, తోటి విద్యార్థులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను సమీపంలోని ప్రత్యూష ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నగరంలోని కామినేని, ఒవైసీ ఆసుపత్రులకు తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.



బిస్కెట్ల తయారీలో తవుడు!

మొదటి పేజీ తరువాయి

మాత్రమే ఉద్దేశించినది' అని స్పష్టంగా రాసి ఉన్న తవుడు బస్తాలను అధికారులు కనుగొన్నారు. మనుషుల వినియోగానికి ఏమాత్రం పనికిరాని ఈ తవుడును, బిస్కెట్లలో ఫైబర్ (పీచుపదార్థం) కోసం ముడిసరుకుగా వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆరోపణలతో పాటు, సదరు పరిశ్రమలో మరిన్ని లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తమ ప్రకటనలో పేర్కొంది. పరిశ్రమ ప్రాంగణంలో అపరిశుభ్రత, పురుగుల నివారణ చర్యలు చేపట్టకపోవడం, ముడిసరుకుల నిల్వలో నిర్లక్ష్యం, సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం వంటి అనేక ఉల్లంఘనలను గుర్తించినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, కంపెనీ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశామని, తాజాగా క్రిమినల్ చర్యల్లో భాగంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చామని వివరించింది. సాధారణంగా ధాన్యాల పైపొర అయిన తవుడును ఆహారంలో ఫైబర్ కోసం వాడుతుంటారు. అయితే, మనుషుల కోసం వాడే 'ఫుడ్-గ్రేడ్' ముడిపదార్థాలకు, పశువుల దాణాకు నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. పశువుల దాణాగా నిర్దేశించిన పదార్థాలను మనుషుల ఆహారంలో కలపడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఈ చర్యలు కేవలం ప్రియగోల్డ్ సంస్థకే పరిమితం కాలేదు. ఫుల్ క్రీమ్ మిల్క్ శాంపిల్‌లో డిటర్జెంట్ అవశేషాలు గుర్తించినందుకు 'దొడ్ల డెయిరీ'పై, ఎండు ద్రాక్షలో పురుగుమందులు అవశేషాలు ఉన్నందుకు యూఈఐఆర్ ఆర్గానిక్ ఫుడ్స్‌పై కూడా ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అయితే, ఏయే ప్రియగోల్డ్ బిస్కెట్ వేరియంట్లలో ఈ ఉల్లంఘనలు జరిగాయి, ఏ బ్యాచ్‌లకు ఇది వర్తిస్తుంది అనే వివరాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించలేదు. అలాగే, దేశవ్యాప్తంగా ఆ బిస్కెట్లను వెనక్కి తీసుకోవాలని (రీకాల్) కూడా ఇప్పటి వరకు ఆదేశాలు జారీ చేయలేదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజా ఆరోపణలపై సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో సంస్థ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

చెరుకుతో ఇథనాల్ తయారీ బంద్

మొదటి పేజీ తరువాయి

తెలుస్తోంది. ఇథనాల్ తయారీకి షుగర్ వాడకంపై బ్యాన్ విధించడంతో మొక్కజొన్న, విరిగిన బియ్యం, అదనపు ఆహార ధాన్యాలు, భారత ఆహార సంస్థ వద్ద ఉన్న మిగులు బియ్యం వంటి ధాన్యాల ఆధారంగా ఇథనాల్ ఉత్పత్తికి ప్రాధాన్యం పెరగనున్నట్లు తెలుస్తోంది. చక్కెర పరిశ్రమ నుంచి వచ్చే సీ-హెవీ మొలాసిస్ వంటి ప్రత్యామ్నాయ ముడి పదార్థాల వినియోగంపైనా దృష్టి సారించనున్నారు. కాగా భారత్‌లో పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే కార్యక్రమం కింద 20 శాతం ఇథనాల్ మిశ్రమం (ఈ20) లక్ష్యాన్ని నిర్దేశించిన గడువుకంటే ముందుగానే సాధించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం సుమారు 2,000 కోట్ల లీటర్లకు చేరినట్లు అంచనాలు ఉన్నాయి.

శిశువుల ఆహారంలో ఫ్రక్టోజ్, సుక్రోజ్ వద్దు!

మొదటి పేజీ తరువాయి

తగ్గించడం ద్వారా శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, పోషకాహార భద్రతను బలోపేతం చేయడమే ఈ ప్రతిపాదనల లక్ష్యమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ తెలిపింది. 'బిడ్డ ఎదుగుదలకు మొదటి ఆరు నెలలు ఎంతో కీలకం. ఈ వయసు వారికి అవసరమైన పోషకాలు అందించేలా.. సంబంధిత ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లను కలపకుండా చూసేలా ఈ ప్రతిపాదనలను రూపొందించారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే ప్రభుత్వ సిఫార్సులను ప్రోత్సహించేందుకూ ఈ చర్యలు తోడ్పడతాయి. బాల్యంలోనే ఊబకాయం, సంబంధిత ఆరోగ్య సవాళ్లను అరికట్టడం కూడా ఈ ప్రతిపాదనల ఉద్దేశం' అని తెలిపింది. ముసాయిదా ప్రతిపాదనలపై 60 రోజుల్లోపు అభ్యంతరాలను, సూచనలను సమర్పించవచ్చని పేర్కొంది.

పిల్లలకూ ఇంటర్నెట్ హక్కు

మొదటి పేజీ తరువాయి

చేయాలని సూచించింది. పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ డేటాబేస్‌ను రూపొందించాలని ఆదేశించింది. అలాంటి కంటెంట్‌కు సంబంధించిన యూఆర్ఎల్, డిజిటల్ గుర్తింపులను నమోదు చేసి, వాటి వ్యాప్తిని అడ్డుకునేందుకు మార్గ దర్శకాలు రూపొందించాలని స్పష్టం చేసింది. పిల్లల రక్షణ విషయంలో అధికారులు, సోషల్ మీడియా సంస్థలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ధర్మాసనం పేర్కొంది. పిల్లలకు సురక్షితమైన ఇంటర్నెట్ అందించడంతోపాటు, వారి ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

తొక్కిసలాటలో 17 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

బృందాలు క్షణాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని సమీపంలోని కోల్‌కతా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వర్షం ప్రారంభం కావడంతో పండల్ బయట నిలిచి ఉన్న జనం ఒక్కసారిగా ముందుకు తోసుకుని రావడంతో తొక్కిసలాట జరిగినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఈ క్రమంలో కొందరు రోడ్డుపై పడిపోయి ప్రాణాలు కోల్పోయారని సదరు అధికారి పేర్కొన్నారు. కాగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అగర్వాల్‌తో కలిసి స్వయంగా ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లిన ఆయన, చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ దుర్ఘటనపై పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "చోర్‌బగాన్ పూజా పండల్‌లో జరిగిన తొక్కిసలాట వార్త తీవ్ర దిగ్భ్రాంతిని, బాధను కలిగించింది.

తెలంగాణలో తీవ్ర కరవు

315 మండలాల్లో పరిస్థితి దారుణం.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అసధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి

ప్రజలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో నేటి నుంచి వానలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

ఏపీలో రాజ్యాంగం కుప్పకూలింది: జగన్

తాడేపల్లి, అక్టోబర్ 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని, ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ హింసకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలకు గూండా లైసెన్స్‌లు ఇచ్చి, వారికి అండగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని జగన్ ఆరోపించారు. "రాజకీయ హింసావాదిగా తన చరిత్రను మరోసారి చాటుకుంటూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్‌ను నడిపిస్తున్నారు. ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయలేని దుస్థితి సృష్టించారు" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులను పోలీసుల సమక్షంలోనే కత్తులు, కర్రలతో వెంటాడుతున్నారని, నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఢిల్లీ నిరసనల వెనుక పెద్ద స్కెచ్

బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): ఢిల్లీలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల వెనుక భారీ కుట్ర దాగి ఉందని తెలంగాణ బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఒకప్పుడు భారత్-బంగ్లాదేశ్ మధ్య దశాబ్దాలుగా నలిగిన సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల సమస్యకు, ప్రస్తుత ఆందోళనలకు సంబంధం ఉందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని గద్దె దించాలనే ఏకైక లక్ష్యంతో విపక్షాలు, కొన్ని విదేశీ శక్తులు కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై ఆయన విడుదల చేసిన ఒక వీడియో ప్రస్తుతం విస్తృతంగా ప్రచారంలో ఉంది. 2015కు ముందు భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రపంచంలోనే అత్యంత విచిత్రంగా ఉండేదని విశ్వేశ్వర్ రెడ్డి వివరించారు. "బంగ్లాదేశ్‌లో భారత్‌కు చెందిన 111 ఎన్‌క్లేవ్‌లు (చిన్న భూభాగాలు), భారత్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన 51 ఎన్‌క్లేవ్‌లు ఉండేవి. ఈ ప్రాంతాల్లోని ప్రజలకు సరైన గుర్తింపు, పౌరసత్వం, ప్రభుత్వ సేవలు అందేవి కావు" అని ఆయన గుర్తుచేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం 2015లో చారిత్రక భూ సరిహద్దు ఒప్పందం ద్వారా ఈ సమస్యను పరిష్కరించిందని తెలిపారు. అలాంటి అసంబద్ధమైన సరిహద్దుల వల్ల అక్రమ వలసలు పెరిగిపోయాయని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొన్ని పార్టీలు దీనిని ప్రోత్సహించాయని ఆయన ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, అసోంలో కాంగ్రెస్ పార్టీలు ఈ వలసలను ప్రోత్సహించాయని, దాని ప్రభావం హైదరాబాద్, ఢిల్లీ, బీహార్, ఒడిశా వరకు పాకిందని అన్నారు. ఇప్పుడు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేస్తుంటే, అదే శక్తులు వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. "విపక్షాలకు నీట్, యూపీఐ, ఎన్నికల సంఘం వంటి అంశాలపై ఉమ్మడి అభిప్రాయం లేదు. వారి ఏకైక ఉమ్మడి లక్ష్యం ప్రధాని మోదీని ఓడించడం, అధికార మార్పు తీసుకురావడం" అని విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఒక నేతకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్కసారిగా లక్షలాది ఫాలోవర్లు పెరగడం నూటికి నూరు శాతం నకిలీ అని, డబ్బుతో సృష్టించినవేనని ఆయన ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు కరెన్సీ, చమురు వాణిజ్యం, ఐటీ, ఫార్మా రంగాలపై కూడా ఒత్తిడి తెస్తున్నారని, ప్రధాని మోదీ బలమైన నాయకత్వం వల్లే దేశం నిలదొక్కుకోగలుగుతోందని ఆయన అన్నారు.

డబుల్ డెక్కర్ బస్సులు మూలకు!



హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డబుల్ డెక్కర్ బస్సులు నెల రోజులుగా రోడ్డెక్కడం లేదు. పండుగ సెలవుల నేపథ్యంలో నగరాన్ని చూసేందుకు వస్తున్న పర్యాటకులకు ఇది తీవ్ర నిరాశ కలిగిస్తోంది. హెచ్ఎండీఏ నుంచి నిర్వహణ బాధ్యతలను పర్యాటక శాఖ స్వీకరించినప్పటికీ, వాటిని నడపడంలో విఫలమైంది. దీంతో అత్యంత వైభవంగా ప్రారంభమైన ఈ బస్సు సర్వీసులు ప్రస్తుతం షెడ్డుకే పరిమితమయ్యాయి. గతంలో హెచ్ఎండీఏ సుమారు రూ.13 కోట్ల వ్యయంతో ఆరు ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను కొనుగోలు చేసింది. ఒక్కో బస్సులో 65 మంది ప్రయాణించే వీలుంది. ట్యాంక్‌బండ్, అసెంబ్లీ, చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ వంటి ప్రధాన పర్యాటక మార్గాల్లో వీటిని ఉచితంగా నడిపారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో విజయవంతంగా నడిచిన ఈ బస్సుల నిర్వహణ బాధ్యతలను ఇటీవల పర్యాటక శాఖకు అప్పగించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గత నెల 27 నుంచే ఈ బస్సులను తిరిగి ప్రారంభిస్తామని పర్యాటక శాఖ అధికారులు ప్రకటించారు. బస్సులకు కొత్త రంగులు వేసి, హైదరాబాద్ అందాలను ప్రతిబింబించే స్టిక్కర్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కానీ, చెప్పిన తేదీ దాటి నెల రోజులు గడుస్తున్నా ఒక్క బస్సు కూడా రోడ్డెక్కలేదు. ప్రస్తుతం ఈ బస్సులన్నీ సంజీవయ్య పార్కులోని ప్రత్యేక షెడ్‌లో నిలిపి ఉంచారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు నగరానికి వస్తున్నారు. ముఖ్యంగా హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాల్లో తిరిగేందుకు ఇతర వాహనాలకు అనుమతి లేకపోవడంతో డబుల్ డెక్కర్ బస్సులే ప్రధాన ఆధారం. అవి అందుబాటులో లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడం వల్ల వారిపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఓ కుటుంబం సచివాలయం నుంచి సంజీవయ్య పార్కుకు వెళ్లాలంటే రూ.400 నుంచి రూ.600 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని సందర్శకులు వాపోతున్నారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా ఈ బస్సు సర్వీసులను పునఃప్రారంభించాలని నగరవాసులు, పర్యాటకులు కోరుతున్నారు.



కోమటిరెడ్డి కోసం తలైనా ఇస్తా

కానీ నీళ్ల కోసం యుద్ధమే: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 17 (ఈవార్తలు): జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ గురువైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోసం తన తలనైనా నరుక్కుంటానని... కానీ పాలమూరు ప్రాంత నీటి హక్కుల విషయంలో మాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నీళ్ల కోసం అవసరమైతే గురువుతోనైనా యుద్ధం చేస్తానని, తన ప్రాంత ప్రయోజనాలే తనకు ముఖ్యమని తేల్చిచెప్పారు. జడ్చర్లలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల మధ్య నీటి కేటాయింపుల వివాదంపై ఆయన తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రతిపాదనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. ముందుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పాలమూరుకు నీరందించాకే, దిండికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కేవలం 60 శాతమే పూర్తయ్యాయని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి కోసం జేఏసీ తలపెట్టిన జలదీక్షకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రాజెక్టు సాధన కోసం పాలమూరు ఎమ్మెల్యేలంతా ఐక్యంగా పోరాడతామని చెప్పారు. అదే సమయంలో, ప్రతి అంశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనవసరంగా లక్ష్యంగా చేసుకోవద్దని ఆయన హితవు పలికారు.

చంద్రబాబు ప్లాన్..

రేవంత్ యాక్షన్

తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర: హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

'సౌత్ బీహార్'గా ఏపీ: షర్మిల

విజయవాడ, అక్టోబర్ 17 (ఈవార్తలు): టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు. నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.



అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్ముతాం: పొన్నం

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక భరోసా ఇచ్చారు. వారి పెండింగ్ బకాయిలను వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ చెల్లింపుల కోసం అవసరమైతే విలువైన ఆర్టీసీ భూములను విక్రయించేందుకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన యునైటెడ్ ఫ్రంట్ నేతలతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన ఆయన... రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న బకాయిల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) బకాయిలతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పొన్నం ప్రభాకర్ వివరించారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించడానికి భూముల అమ్మకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి
ఎంపీ ధర్మపురి కృషి: భోగ శ్రావణి



బీర్పూర్, అక్టోబర్ 17 (ఈవార్తలు): బీర్పూర్ మండలం కొల్వాయి గ్రామంలో నిజామాబాద్ ఎంపీ అరవింద్ ధర్మపురి నిధులతో మంజూరైన హైమాస్ట్ దీపాన్ని గ్రామ ఉపసర్పంచ్ జక్కుల నాగరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. భోగ శ్రావణి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజల అవసరాలను తీర్చేందుకు ఎంపీ అరవింద్ ధర్మపురి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హైమాస్ట్ దీపాల ఏర్పాటుతో ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద రాత్రివేళ వెలుతురు అందుబాటులోకి వస్తుందని, ప్రజల రాకపోకలకు సౌకర్యంతోపాటు భద్రతకు కూడా మేలు కలుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి నిధులను ప్రజల అవసరాలకు వినియోగిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో బీజేపీ ముందుంటుందని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీర్పూర్ మండల అధ్యక్షుడు అడెపు నర్సయ్య, జిల్లా కార్యదర్శి పాత రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్, శ్రీపతి రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి
12 గంటల విద్యుత్తు ఇవ్వాలి

రాష్ట్రంలో విద్యుత్తు కోతలు లేకుండా వ్యవసాయానికి కనీసం 12 గంటల పాటు విద్యుత్తు సరఫరా చేయాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్తు, తాగునీరు, సాగునీటి సమస్యలతోపాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. ఈ సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెంటనే స్పందించి రోళ్లవాగు నుంచి 0.25 టీఎంసీల నీటిని తరలించి ధర్మపురి, బీర్పూర్ మండలాల్లో నీటి కొరతను తీర్చాలని జీవన్‌రెడ్డి కోరారు. నీటిని నింపేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తాను ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తానని, అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాయికల్ పురపాలక చైర్మన్ కట్కం రవి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, మండల, పట్టణ సమన్వయకర్త తురగ శ్రీధర్‌రెడ్డి, బర్కం మల్లేష్, గోపిరాజరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



మార్కెట్ల అభివృద్ధికి చర్యలు

త్వరలో బీట్ బజార్ ప్రారంభం

జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్

జగిత్యాల, అక్టోబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో మార్కెట్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎల్ఎల్ గార్డెన్స్‌లో నిర్వహించిన పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు అబ్బూరి మల్లేశం తదితర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, రైతు సేవా సంకల్ప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దకాలంగా నిరుపయోగంగా ఉన్న రైతుబజార్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చామని తెలిపారు. చల్గల్ మార్కెట్‌లో రూ. 1.80 కోట్లతో సీసీ రహదారి నిర్మించామని, బీట్ బజార్ సమీకృత మార్కెట్‌ను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి విద్యుత్తు ఉత్పత్తిపై ప్రభావం పడే పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వాణి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విమర్శలు మాని పాలనపై దృష్టి పెట్టాలి

మూడేళ్లలో అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం .. ఎల్‌నినో ముప్పుపై ముందస్తు చర్యలేవి?: జీవన్ రెడ్డి

రాయికల్, అక్టోబర్ 17 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నారా.. అధికారంలో ఉన్నారా అన్నది అర్థం కావడం లేదని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మానుకుని రాష్ట్ర పరిపాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. శనివారం రాయికల్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడి విద్యుత్తు, తాగునీరు, సాగునీటి సరఫరాపై ప్రభావం పడే ప్రమాదం ఉందని జీవన్‌రెడ్డి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉత్తర తెలంగాణలో కరువు సమస్యను అధిగమించే అవకాశం ఉందని, మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కేంద్ర జలవనరుల కమిటీ సుందిళ్ల, అన్నారం బ్యారేజీల ద్వారా నీటిని వినియోగించుకునేందుకు అనుమతులు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కన్నెపల్లి దిగువన రాగి కట్ట నిర్మిస్తే నీటిని నిల్వ చేసి సాగు, తాగునీటి అవసరాలు తీర్చవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.300 కోట్లు వెచ్చించి అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. గత ప్రభుత్వం నిర్మించిందనే కారణంతో ప్రాజెక్టులను వినియోగించుకోకపోతే కరువు సమస్య మరింత తీవ్రతరం అవుతుందని అన్నారు.



నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం

గుడిపేటలో కెమెరాలను ప్రారంభించిన సీఐ రాజ్‌కుమార్

మల్యాల, అక్టోబర్ 17 (ఈవార్తలు): గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని మల్యాల సీఐ రాజ్‌కుమార్ అన్నారు. మల్యాల మండలం గుడిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేత అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై సందీప్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నివారణకు, ఘటనలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క అనిల్, సర్వాపూర్ సర్పంచ్ జంగిలి హనుమంత్, గుడిపేట ఉపసర్పంచ్ గొట్టె అనిత నరేష్, కాంగ్రెస్ నాయకులు మ్యాక లక్ష్మణ్, మంద తిరుపతిగౌడ్, బండి రవిగౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

VANGS GLOBAL TECHNOLOGIES LLP

ePaper Pro
దసరా శుభాకాంక్షలు

DASARA SPECIAL OFFER

Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

SAVE 20%
Standard 5 GB · 5 users
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹8,124 ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR

SAVE 20%
Expanded 10 GB · 10 users
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹12,499 ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR

SAVE 20%
Full Press 15 GB · 30 users
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹16,249 ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to interactive ePaper

SAVE 20%
Standard 5 GB · 5 users
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Unlimited pageviews & SEO
✓ Country & device-wise views
₹9,999 ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR

SAVE 20%
Expanded 10 GB · 10 users
✓ WhatsApp & email support
✓ Drag & drop theme builder
✓ Employee ID card design
✓ Custom domain & push alerts
₹14,999 ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR

SAVE 20%
Full Press 15 GB · 30 users
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Custom domain & push alerts
₹19,999 ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

SAVE 20%
Standard 5 GB · 5 users
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹17,499 ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR

SAVE 20%
Expanded 10 GB · 10 users
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹22,499 ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

BEST VALUE
Full Press 15 GB · 30 users
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹32,499 ₹25,999
20% OFF · SAVE ₹6,500 / YEAR

PLATFORM HIGHLIGHTS
◆ Smart AI image extraction
◆ AdSense & sponsor ad slots
◆ Custom domain + auto SSL
◆ One-click publishing
◆ WhatsApp sharing
◆ AI tagging & SEO tags
◆ Real-time analytics
◆ AWS cloud · daily backups
◆ YouTube video embedding

Try free for 12 days
No credit card required · Turn your print edition into a digital publication

CALL / WHATSAPP +91 7675087378
EMAIL hr@vangstechnologies.com
WEBSITE www.vangstechnologies.com

SCAN TO VISIT OUR WEBSITE
SCAN TO CALL +91 7675087378

రైతు చేతిలో డిజిటల్ గుర్తింపు



వ్యవసాయ రంగం కూడా శరవేగంగా డిజిటల్ మార్పుల వైపు అడుగులు వేస్తోంది. రైతు భూమి వివరాల నుంచి పంటల సాగు వరకు సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఫార్మర్ రిజిస్ట్రీ ఈ మార్పులో కీలకంగా మారుతోంది.

రైతుకు ప్రత్యేక డిజిటల్ గుర్తింపును కల్పించడం ద్వారా భవిష్యత్తులో వ్యవసాయ సేవలను మరింత సులభతరం చేయాలన్నది ఈ వ్యవస్థ లక్ష్యం. ఇప్పటివరకు రైతుకు సంబంధించిన భూమి, సాగు, పంట, రుణం, బీమా, సంక్షేమ పథకాల వివరాలు వేర్వేరు రికార్డుల్లో ఉండేవి.

ఫలితంగా ఒకే సమాచారాన్ని పలుమార్లు సమర్పించాల్సిన పరిస్థితులు ఏర్పడేవి. ఈ నేపథ్యంలో రైతుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని డిజిటల్‌గా అనుసంధానం చేయడం ద్వారా సేవల పంపిణీని సులభతరం చేసే ప్రయత్నం జరుగుతోంది. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదైన ప్రతి రైతుకు ప్రత్యేక యూనిక్ ఫార్మర్ ఐడీ కేటాయిస్తారు. రైతు పేరు, భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, సాగు వివరాలు వంటి సమాచారాన్ని ఈ డిజిటల్ గుర్తింపుతో అనుసంధానం చేస్తారు తద్వారా రైతు 11 అంకెల ఒక విశిష్ట గుర్తింపు నంబర్ వస్తుంది. భవిష్యత్తులో రైతు ఏ ప్రభుత్వ వ్యవసాయ సేవను పొందాలన్నా, సంబంధిత వివరాలను సులభంగా ధృవీకరించేందుకు ఈ గుర్తింపు సంఖ్య ఉపయోగపడే అవకాశం ఉంది. అంటే రైతు గుర్తింపు ఒకే చోట.. వ్యవసాయానికి సంబంధించిన సమాచారం ఒకే వ్యవస్థలో అన్నమాట.

పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా..

రైతుల వివరాలు సమగ్రంగా అందుబాటులోకి వస్తే ప్రభుత్వ పథకాల అమలులో అర్హతను గుర్తించడం, వివరాలను ధృవీకరించడం వంటి ప్రక్రియలు సులభతరం కావచ్చు. పథకాలకు అర్హులైన రైతులను గుర్తించి ప్రయోజనాలను అందించడంలో డిజిటల్ సమాచారం ఉపయోగపడుతుంది. పీఎం-కిసాన్ వంటి రైతు సంక్షేమ పథకాలతో పాటు భవిష్యత్తులో మరిన్ని వ్యవసాయ సేవలను ఈ డిజిటల్ గుర్తింపుతో అనుసంధానం చేసే అవకాశం ఉంది. అయితే పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా అందాలంటే రిజిస్ట్రీలో నమోదయ్యే సమాచారం కచ్చితంగా ఉండటం అత్యంత అవసరం.



- ఈదులపల్లి రవితేజ

రుణం నుంచి పంట బీమా వరకు

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రభావం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా వ్యవసాయ రుణాలు, పంటల బీమా వంటి రంగాలకు కూడా విస్తరించే అవకాశం ఉంది. రైతు భూమి, సాగు వివరాలు డిజిటల్‌గా అందుబాటులో ఉంటే రుణాల కోసం అవసరమైన సమాచారాన్ని ధృవీకరించడం సులభం కావచ్చు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ రైతు ఏ భూమిలో ఏ పంట సాగు చేశారనే సమాచారం అందుబాటులో ఉంటే పంట నష్టాల అంచనా, బీమా సంబంధిత ప్రక్రియల్లోనూ ఉపయోగపడే అవకాశం ఉంది. రైతు గుర్తింపు వ్యవస్థ బలోపేతమైతే పంటల కొనుగోలు ప్రక్రియలోనూ డిజిటల్ అనుసంధానం పెరగవచ్చు. రైతు, భూమి, సాగు వివరాలు ఒకే వ్యవస్థలో ఉండటం వల్ల కొనుగోలు కేంద్రాల్లో వివరాల ధృవీకరణ సులభతరం కావచ్చు. పంట విక్రయానికి సంబంధించిన చెల్లింపులు కూడా రైతు వివరాలతో అనుసంధానమైన డిజిటల్ వ్యవస్థల ద్వారా నిర్వహించే అవకాశం ఉంటుంది. అయితే దీనికి సంబంధించిన విధానాలు, అమలు రాష్ట్రానికో విధంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు అధికారిక మార్గదర్శకాలను అనుసరించడం అవసరం. ఫార్మర్ రిజిస్ట్రీ అమలులో కొన్ని క్షేత్రస్థాయి సవాళ్లు కూడా ఉన్నాయి. భూమి వారసత్వ మార్పులు, రికార్డుల్లో తప్పులు, భూ వివాదాలు వంటి అంశాలతో పాటు కౌలు రైతుల నమోదు కూడా ముఖ్యమైనది. ఫార్మర్ రిజిస్ట్రీని కేవలం ఒక గుర్తింపు సంఖ్యగా చూడటం కంటే.. భవిష్యత్తులో రైతు కేంద్రంగా అందించే అనేక డిజిటల్ సేవలకు పునాదిగా చూడాల్సి ఉంటుంది. భూమి నుంచి పంట వరకు, పంట నుంచి మార్కెట్ వరకు రైతు సమాచారాన్ని సమగ్రంగా అనుసంధానం చేయగలిగితే వ్యవసాయ రంగంలో సేవల అందుబాటు, పారదర్శకత, సమన్వయం మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

వ్యవసాయ విస్తరణ అధికారి
8897865899

ధనుష్‌ను స్వాగతిస్తాం: అన్నాడీఎంకే

చెన్నై: ప్రముఖ సినీ నటుడు ధనుష్ రాజకీయాల్లోకి ప్రవేశించబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్న ఊహాగానాల మధ్య అన్నాడీఎంకే కీలక వ్యాఖ్యలు చేసింది. ధనుష్ కనుక తమ పార్టీలో చేరాలని నిర్ణయించుకుంటే, ఆయనకు రెండు చేతులతో స్వాగతం పలుకుతామని తమిళనాడు మాజీ మంత్రి, అన్నాడీఎంకే నేత కే.టీ. రాజేంద్ర బాలాజీ అన్నారు. శనివారం శివకాశిలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యువతలో ధనుష్‌కు విశేష ఆదరణ ఉందని, ఆయన ఒక స్టార్ అని రాజేంద్ర బాలాజీ కొనియాడారు. పార్టీని బలోపేతం చేసేందుకు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడే ఎవరినైనా అన్నాడీఎంకే సాదరంగ ఆహ్వానిస్తుందని ఆయన స్పష్టం చేశారు. "ధనుష్ అన్నాడీఎంకేలో చేరితే, మేము ఆయనను మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని బాలాజీ తెలిపారు. ఇటీవల, "తమిళనాడు ఉచ్చి కళగం" పేరుతో ధనుష్ ఒక రాజకీయ పార్టీని ఎన్నికల సంఘం వద్ద నమోదు చేశారంటూ సోషల్ మీడియాలో వార్తలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. దీనికి తోడు అక్టోబర్ 15న ధనుష్ తన అభిమాన సంఘాల ప్రతినిధులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ సమావేశంలో సేవా కార్యక్రమాల నిమిత్తం ప్రత్యేక జెండా, చిహ్నాన్ని కూడా ఆవిష్కరించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ధనుష్ రాజకీయ అరంగేట్రంపై అంచనాలు పెరిగినప్పటికీ, ఆయన వైపు నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె. పళనిస్వామి నాయకత్వంలో పార్టీ పురోభివృద్ధికి తోడ్పడే ఎవరినైనా కలుపుకొని పోతామని బాలాజీ వివరించారు. పార్టీలో చేరే వారి పట్ల ఎలాంటి వివక్ష ఉండదని, నిర్మాణాత్మక ఆలోచనలను ఎల్లప్పుడూ గౌరవిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇదే క్రమంలో, రాజకీయాల్లోకి వచ్చాక నటీనటులు సినిమాల్లో నటించడం మానేయాలని బాలాజీ అభిప్రాయపడ్డారు. ఒకేసారి రాజకీయాలు, సినీ వృత్తిని కొనసాగించడాన్ని ఆయన ఆక్షేపించారు.



పూలలో ప్రకృతి.. పాటల్లో చరిత్ర

బతుకమ్మలో తెలంగాణ ఆత్మ!

తంగేడు పూల పసిడి వన్నెలు..
గునుగు పూల రంగుల హరివిల్లులు..
పల్లెవీధుల్లో మారుమోగే బతుకమ్మ పాటలు.. చప్పట్ల సవ్వడులతో సందడిగా మారే గ్రామ కూడళ్లు..
పుట్టింటికి చేరుకున్న ఆడబిడ్డల ఆనందాలు..
అన్నాచెల్లెళ్ల అనుబంధాలు.. ప్రకృతిని ఆరాధించే తెలంగాణ సంస్కృతి..
ఇవన్నీ కలిస్తేనే బతుకమ్మ! బతుకమ్మ అంటే కేవలం తొమ్మిది రోజుల పండుగ కాదు. అది తెలంగాణ చరిత్రకు సజీవ సాక్ష్యం. ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం. ప్రకృతికి, మనిషికి మధ్య ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే అపురూపమైన సాంస్కృతిక సంపద. కాలం మారినా, తరాలు మారినా, జీవన విధానాలు మారినా బతుకమ్మ పండుగకు ఉన్న ప్రత్యేకత మాత్రం చెక్కుచెదరలేదు.ఒకప్పుడు పల్లెవీధుల్లో పరిమితమైన బతుకమ్మ సంబరాలు నేడు ఖండాంతరాలు దాటాయి. తెలంగాణ ఉద్యమంలో సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ, ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది.అయితే మారుతున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలు, పట్టణీకరణ, సహజ పూల లభ్యతలో మార్పులు, పెరుగుతున్న ఖర్చులు ఈ సంప్రదాయ పండుగ ముందు కొత్త సవాళ్లను నిలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో బతుకమ్మ పుట్టుక, చరిత్ర, ప్రత్యేకతలు, నాటి సంబరాలు, నేటి పరిస్థితులు, భవిష్యత్తులో సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని పరిశీలిస్తే ఎన్నో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి.

బతుకమ్మ అంటే..

అది తల్లి ప్రేమ..
అది పుట్టింటి మమకారం..
అది అక్కాచెల్లెళ్ల అనుబంధం..
అది ప్రకృతి ఆరాధన..
అది మహిళల ఆత్మగౌరవం..
అది తెలంగాణ
ప్రజల సాంస్కృతిక అస్తిత్వం..
పూలు వాడిపోవచ్చు.. కానీ బతుకమ్మ పాటలు వాడిపోవు..
కాలం మారిపోవచ్చు.. కానీ తెలంగాణ ఆడబిడ్డల బతుకమ్మపై ప్రేమ మారదు.
తరాలు మారిపోవచ్చు.. కానీ బతుకమ్మలో నిక్షిప్తమైన సంస్కృతి తరతరాలకు అందుతూనే ఉంటుంది.

ప్రకృతిని కాపాడుకుంటూ, సంప్రదాయాలను గౌరవిస్తూ, మహిళా శక్తిని గుర్తిస్తూ బతుకమ్మ పండుగను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. పూలలో పరిమళం.. పాటల్లో పరవశం.. ఆటల్లో ఆనందం.. బంధాల్లో అనురాగం.. వీటన్నింటి సమాహారమే తెలంగాణ బతుకమ్మ!బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. తెలంగాణ సంస్కృతి తరతరాలు వర్ధిల్లాలి ఉయ్యాలో!



- మధుకర్ వైద్యుల
కవి, రచయిత. 8096677409

బతుకమ్మ పండుగకు శతాబ్దాల చరిత్ర ఉందని భావిస్తారు. అయితే ఈ పండుగ కచ్చితంగా ఏ సంవత్సరంలో ప్రారంభమైందనే విషయంపై ఏకాభిప్రాయం కలిగిన చారిత్రక ఆధారాలు లేవు.బతుకమ్మ పుట్టుకకు సంబంధించి తెలంగాణ ప్రజల్లో అనేక జానపద కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒక కథనం ప్రకారం, పూర్వకాలంలో ఒక రాజదంపతులకు జన్మించిన సంతానం జీవించకపోవడంతో వారు లక్ష్మీదేవిని ప్రార్థించారని, ఆ తర్వాత జన్మించిన కుమార్తె దీర్ఘాయుష్షుతో జీవించాలని ప్రజలు కోరుకుంటూ ఆమెను బతుకమ్మ అని పిలిచారని చెబుతారు.మరో విశ్వాసం ప్రకారం బతుకమ్మ గౌరీదేవి ఆరాధనకు సంబంధించిన పండుగ.ఈ కథనాలన్నీ ప్రజల విశ్వాసాలకు, జానపద సంప్రదాయాలకు సంబంధించినవి. వీటిని నిర్ధారిత చారిత్రక సంఘటనలుగా కాకుండా తరతరాలుగా వస్తున్న సాంస్కృతిక కథలుగా చూడాలి. బతుకమ్మ అనే పేరును సాధారణంగా 'బతుకు అమ్మా' అనే భావంతో అనుసంధానిస్తారు. కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకోవడం ఈ పండుగలోని ప్రధాన భావన.

ఒకప్పుడు బతుకమ్మ పండుగ వచ్చిందంటే తెలంగాణ పల్లెల్లో ప్రత్యేకమైన వాతావరణం కనిపించేది. ఉదయం నుంచే ఆడపిల్లలు, మహిళలు బతుకమ్మ కోసం పూల సేకరణలో నిమగ్నమయ్యేవారు.పొలాల గట్లు, చెరువుల కట్టలు, పచ్చిక బయళ్లు, గ్రామ శివార్లలో సహజంగా పూసే తంగేడు, గునుగు, కట్ల తదితర పూలను సేకరించేవారు. చిన్నపిల్లలు పెద్దవారితో కలిసి పూల కోసం వెళ్లడం ఒక ఆనందకరమైన అనుభవంగా ఉండేది. పూలు సేకరించేటప్పుడు పెద్దలు వాటి పేర్లు, ప్రత్యేకతలు, ఉపయోగాలను పిల్లలకు వివరించేవారు.ఇలా పూల సేకరణ అనేది కేవలం పండుగ ఏర్పాట్లకే పరిమితం కాకుండా ప్రకృతిని పరిచయం చేసే ఒక సంప్రదాయ విద్యగా ఉండేది.ఇంటికి తీసుకొచ్చిన పూలను మహిళలు శుభ్రపరిచి, రంగులవారీగా వేరు చేసి, తాంబాళాల్లో అందంగా పేర్చేవారు.ఇంటి ముంగిట ముగ్గులు వేసి, పసుపు గౌరమ్మను తయారుచేసి బతుకమ్మను అలంకరించేవారు.సాయంత్రం కాగానే గ్రామ కూడళ్లు మహిళలతో కళకళలాడేవి.ఒక్కొక్క ఇంటి నుంచి బతుకమ్మలను తీసుకొచ్చి ఒకచోట ఉంచేవారు. వాటి చుట్టూ మహిళలు వలయాకారంలో నిలబడి చప్పట్లు కొడుతూ పాటలు పాడేవారు.అప్పట్లో నేటిలా పెద్ద సౌండ్ సిస్టమ్‌లు, విద్యుత్ అలంకరణలు, ప్రత్యేక వేదికలు లేకపోయినా పండుగలో ఆనందానికి కొదవ ఉండేది కాదు.పూల సువాసనలే అలంకరణలు.. మహిళల పాటలే సంగీతం.. చప్పట్లే తాళాలు.. పల్లెవీధులే పండుగ వేదికలు!

తెలంగాణ కుటుంబ వ్యవస్థలో బతుకమ్మకు ప్రత్యేకమైన స్థానం ఉంది.వివాహమైన ఆడబిడ్డలు బతుకమ్మ పండుగ సందర్భంగా పుట్టింటికి రావడం అనేక కుటుంబాల్లో కొనసాగుతున్న సంప్రదాయం. పెళ్లయిన కుమార్తె ఇంటికి వస్తుందంటే తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవు.అక్కాచెల్లెళ్లు, వదినామరదళ్లు, బంధువులంతా కలిసి బతుకమ్మలను పేర్చడం, పాటలు పాడడం, సద్దులు తయారుచేయడం పండుగలో భాగం.బతుకమ్మ పాటల్లో అన్నాచెల్లెళ్ల అనుబంధం, పుట్టింటి మమకారం, అత్తింటి జీవితం, మహిళల ఆశలు, అనుభవాలు ప్రతిబింబిస్తాయి.ఇలా బతుకమ్మ కుటుంబ బంధాలను బలోపేతం చేసే పండుగగా నిలిచింది.ముఖ్యంగా గ్రామీణ మహిళలకు తమ అనుభవాలను, ఆనందాలను, బాధలను పరస్పరం పంచుకునే సామూహిక వేదికగా కూడా ఈ పండుగ ఉపయోగపడింది.

బతుకమ్మ పండుగను సాధారణంగా మహాలయ అమావాస్య నుంచి దుర్గాష్టమి వరకు తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారు.మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మ పేర్లతో ఈ తొమ్మిది రోజులను పిలుస్తారు.ప్రతి రోజూ ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారు.ప్రాంతీయ సంప్రదాయాలను బట్టి నైవేద్యాలు, పూజా విధానాల్లో కొన్ని తేడాలు కనిపిస్తాయి.చివరి రోజు సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ రోజున మహిళలు పెద్ద బతుకమ్మలను పేర్చి, వివిధ రకాల సద్దులను తయారుచేసి, సామూహికంగా ఆటపాటల్లో పాల్గొంటారు.అనంతరం సంప్రదాయం ప్రకారం బతుకమ్మలను నీటి వనరుల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ పాటలు తెలంగాణ జానపద సాహిత్యంలో అమూల్యమైన సంపద.ఈ పాటల్లో దేవతల కథలతో పాటు పల్లె జీవితం, వ్యవసాయం, కుటుంబ సంబంధాలు, సామాజిక పరిస్థితులు, ప్రజల విశ్వాసాలు ప్రతిబింబిస్తాయి.బతుకమ్మ పాటలు ప్రధానంగా మౌఖిక సంప్రదాయం ద్వారా ఒక తరం నుంచి మరో తరానికి అందుతున్నాయి. పెద్దవారు పాడే పాటలను చిన్నవారు నేర్చుకుంటారు.ఇలా పుస్తకాల్లో నమోదు కాని అనేక స్థానిక కథలు, సంప్రదాయాలు, సామాజిక అనుభవాలు పాటల రూపంలో సజీవంగా నిలిచాయి.

ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో సంప్రదాయంగా నిర్వహించే బతుకమ్మ నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది.ఉద్యోగాలు, విద్య, వ్యాపారాల కోసం విదేశాలకు వెళ్లిన తెలంగాణప్రజలు అక్కడ కూడా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నారు.అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాల్లో తెలంగాణ సంఘాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరుగుతున్నాయి.విదేశాల్లో పెరుగుతున్న పిల్లలకు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేయడంలో ఈ కార్యక్రమాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి.బతుకమ్మ పాటలు, సంప్రదాయ దుస్తులు, పూల అలంకరణలు, తెలంగాణ వంటకాలు విదేశీ వేదికలపై ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చే పండుగగా ఎదుగుతోంది. ప్రకృతితో ముడిపడిన బతుకమ్మ పండుగకు ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయి.వర్షాకాలం ముగిసే సమయంలో బతుకమ్మ వేడుకలు జరుగుతాయి.అయితే కొన్ని సంవత్సరాల్లో అక్టోబర్ నెలలోనూ భారీ వర్షాలు కురవడం, మరికొన్ని సందర్భాల్లో వర్షపాతం తక్కువగా నమోదవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి మార్పులు సహజ పూల లభ్యతను, పూల సేకరణను, బహిరంగ వేడుకల నిర్వహణను ప్రభావితం చేసే అవకాశం ఉంది.అకాల వర్షాల వల్ల పూలు దెబ్బతినడం, రవాణాలో అంతరాయం ఏర్పడడం, చెరువుల వద్ద నిమజ్జనానికి ఇబ్బందులు ఎదురవడం వంటి సమస్యలు తలెత్తవచ్చు.అదేవిధంగా వర్షాభావ పరిస్థితులు కొన్ని ప్రాంతాల్లో సహజ పూల పెరుగుదలను ప్రభావితం చేయవచ్చు.అయితే ప్రతి సంవత్సరం కనిపించే వాతావరణ మార్పులను ఒకే కారణానికి ఆపాదించలేం.వాతావరణ మార్పులు, స్థానిక వర్షపాత పరిస్థితులు, భూవినియోగ మార్పులు వంటి అంశాలను విడివిడిగా పరిశీలించాలి. ఎల్‌నినో అనేది భూమధ్యరేఖ సమీపంలోని మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరిగే వాతావరణ-సముద్ర సంబంధిత ప్రక్రియ. ఇది ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల నమూనాలను ప్రభావితం చేయగలదు.భారతదేశ నైరుతి రుతుపవనాలపై కూడా ఎల్‌నినో ప్రభావం పడింది.

జెలెన్‌స్కీ ప్రెస్‌మీట్‌లో కంపు!

ప్రపంచమంతా అత్యంత ఆసక్తిగా గమనిస్తున్న కీలక సమావేశం అది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ బ్రస్సెల్స్‌లో యూరోపియన్ కౌన్సిల్ నేతలతో భేటీ అయ్యారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, దాని పర్యవసనాలపై తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు ప్రతీ క్షణాన్ని కవర్ చేసేందుకు ప్రెస్ బ్రీఫింగ్ రూంలో ఎంతో సీరియస్‌గా ఎదురుచూస్తున్నారు. ఇంతలో ఎవరూ ఊహించని ఓ 'అదృశ్య శత్రువు' దాడి చేసింది. ఆ శత్రువు మరెవరో కాదు... ఓ ఘాటైన అపాన వాయువు (పిత్తు) దుర్గంధం. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు... పదే పదే ఆ గది మొత్తం భరించలేని దుర్గంధంతో నిండిపోయింది. అక్కడున్న వారిలోనే ఓ వ్యక్తి ఎవరికీ తెలియని రీతిలో 'గ్యాసెస్' వదులుతుండంతో, జర్నలిస్టులు ఉక్కిరబిక్కిరయ్యారు. ఊపిరాడక ఆ గదిలోంచి బయటకు పరుగులు తీశారు. యుద్ధం లాంటి తీవ్రమైన అంశంపై జరుగుతున్న సమావేశంలో ఈ విచిత్రమైన అంతరాయం అందరినీ విస్తుపోయేలా చేసింది. ముందు రోజు జరిగిన ఓ దౌత్యపరమైన సమావేశంలోనూ ఇదే తరహా 'కంపు' పరిస్థితి తలెత్తడంతో, ఎవరో కావాలనే ఈ పని చేస్తున్నారనే అనుమానాలు మొదలయ్యాయి. ఈ ఘటనపై ప్రముఖ రాజకీయ ఆర్థిక విశ్లేషకుడు శంకర్ అయ్యర్ 'ఎక్స్' వేదికగా సరదాగా స్పందించారు. "జెలెన్‌స్కీ కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులు, తమ మధ్యలో ఉన్న ఓ 'ఫాంటమ్ ఫార్టర్' (ఎవరికీ తెలియకుండా పిత్తులు వదిలే వ్యక్తి)తో పదే పదే ఇబ్బంది పడ్డారు. ఇది చాలా నవ్వు తెప్పిస్తోంది" అంటూ పోస్ట్ చేశారు. కాఫీలు తాగుతూ, ఏ వార్త మిస్ అవుతామోనన్న ఆందోళనతో ఉన్న జర్నలిస్టులు ఈ వాసనతో సొమ్మసిల్లి పడిపోయేలోపు, ఆ 'రహస్య దుర్గంధకారి' తన పనిని బయట చూసుకోవాల్సిందని ఆయన చమత్కరించారు. ప్రముఖ మీడియా సంస్థ 'పొలిటికో యూరప్' ఈ ఘటనపై ఒక అడుగు ముందుకేసి, "యూరోపియన్ కౌన్సిల్ ప్రెస్ రూంలో పదే పదే పిత్తులు వదులుతున్నది ఎవరు?" అని సూటిగా ప్రశ్నిస్తూ కథనాన్ని ప్రచురించింది. దీనిపై సోషల్ మీడియాలో జోకులు పేలాయి. కొందరు ఆ కథనం రాసిన జర్నలిస్టునే నిందితుడిగా ఆరోపిస్తే, మరికొందరు తాము నిర్దోషులమని ప్రకటించుకున్నారు. ఇంకొంతమంది అయితే, ఇది "రష్యా చేస్తున్న కొత్తరకం హైబ్రిడ్ వార్‌ఫేర్" కావచ్చంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మొత్తం మీద, ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించేంతటి తీవ్రమైన చర్చల మధ్యలో చోటుచేసుకున్న ఈ 'వాయు' దాడి, కాసేపు నవ్వులు పూయించి, అక్కడి ఉద్రిక్త వాతావరణాన్ని తేలికపరిచింది. అయితే, ఆ అజ్ఞాత 'అపాన వాయు యోధుడు' ఎవరనేది మాత్రం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయింది.

ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఈడీ దాడులు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్, సైబర్ ఫ్రాడ్ సిండికేట్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్, ముంబై, పుణే, మెహసానా, సూరత్ నగరాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో మనీలాండరింగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించినట్లు ఈడీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 13న నిర్వహించిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద, ఈ కేసుతో సంబంధం ఉన్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు పేర్కొంది. "ఆల్ ప్యానెల్ ఎక్స్ఛేంజ్", "ఎమ్‌జీఎమ్91" అనే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో భాగంగా గతంలో పుణె, ముంబై, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన అధికారులు, ఎడ్జమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రాంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పుణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది.









సంగీత దర్శకుడు దేవా కన్నుమూత

ప్రముఖ సంగీత దర్శకుడు దేవా (75) కన్నుమూశారు. గుండెపోటుతో చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. తమిళంతో పాటు తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో సుమారు 400 సినిమాలకు సంగీతం అందించిన ఆయన.. తమిళ చిత్ర పరిశ్రమలో 'గానా' సంగీత శైలికి విశేష గుర్తింపు తీసుకొచ్చారు. 1950లో చెన్నైలో జన్మించిన దేవా.. జేబీ కృష్ణ వద్ద శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు. 1986లో విడుదలైన 'మాట్టుకర మన్నారు' సినిమాతో సంగీత దర్శకుడిగా సినీ రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత తమిళంతో పాటు పలు భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'శ్రీమాన్ బ్రహ్మచారి' సినిమాతో సంగీత దర్శకుడిగా పరిచయమైన దేవా.. ఆ తర్వాత పలు విజయవంతమైన చిత్రాలకు స్వరాలు అందించారు. చిరంజీవి నటించిన 'మాస్టర్', పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'తొలిప్రేమ'తో పాటు 'ఆటోడ్రైవర్', 'బాగున్నారా', 'నాగ' వంటి సినిమాలకు సంగీతం అందించారు. ఆయన స్వరపరిచిన పాటలు తెలుగు ప్రేక్షకులనూ అలరించాయి. తమిళంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'బాషా', 'అన్నామలై', 'అరుణాచలం' వంటి విజయవంతమైన చిత్రాలకు దేవా సంగీతం అందించారు. ముఖ్యంగా సామాన్యుల జీవితాలకు దగ్గరగా ఉండే గానా పాటలకు తనదైన శైలిని జోడించి ప్రజల్లోకి తీసుకెళ్లారు. అందుకే తమిళ సినీ పరిశ్రమలో ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. దేవా కుటుంబం నుంచి ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ కుమారుడు శ్రీకాంత్ దేవా కూడా సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు. తమిళ నటుడు జై ఆయన మేనల్లుడు. దశాబ్దాల పాటు దక్షిణాది సినీ సంగీతానికి సేవలందించిన దేవా మరణవార్తతో సినీ వర్గాల్లో విషాదం నెలకొంది.

గుండెపోటుతో యువ దర్శకుడు మృతి

మలయాళ చిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. తన తొలి వెబ్‌సిరీస్ విడుదలైన తెల్లారే యువ దర్శకుడు బెర్లాజ్ కలరిక్కల్ హఠాన్మరణం పాలయ్యారు. ఇరవై ఏడేళ్ల బెర్లాజ్ కొచ్చిలోని ఒక హోటల్ గదిలో విగతజీవిగా కనిపించాడు. దాంతో కలకలం రేగింది. బెర్లాజ్ గుండెపోటుతో మృతిచెందినట్లు తెలుస్తున్నది. కాగా బెర్లాజ్ దర్శకత్వం వహించిన తొలి వెబ్ సిరీస్ 'కప్పి స్క్వాడ్' శుక్రవారమే జియో హాట్‌స్టార్‌లో



విడుదలైంది. మరుసటి రోజే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆరేళ్లుగా ఓ మహిళను ప్రేమిస్తున్న ఆయన.. గత సెప్టెంబర్‌లోనే వివాహం చేసుకున్నారు. అటు వృత్తిగతంగా ఇటు వ్యక్తిగత జీవితంలో స్థిరపడుతున్న తరుణంలో బెర్లాజ్ అకాల మరణం చిత్ర పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. గతంలో 'నిజల్', 'మధురం', 'దాకిని' వంటి చిత్రాలకు బెర్లాజ్ సహాయ దర్శకుడిగా పనిచేశారు. 'కప్పి స్క్వాడ్' వెబ్ సిరీస్‌తో ఆయన పూర్తిస్థాయి దర్శకుడిగా పరిచయమయ్యారు. రినోష్ జార్జ్, అనఘ అజిత్, దియా దీపన్, జోయెల్ జోసెఫ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్.. నలుగురు యువకుల స్టార్టప్ కలల నేపథ్యంలో సాగుతుంది. శ్రీకాంత్ మోహన్ రూపొందించిన ఈ సిరీస్‌ను ప్రముఖ నిర్మాత రాహుల్ రిజి నాయర్ నిర్మించారు.




ఆరియానా, వివియానాలతో సోనియా బిజినెస్!

టాలీవుడ్, కోలీవుడ్ సర్కిల్స్‌లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండే మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ పెళ్లి వార్తలు ఇప్పుడు నిజమయ్యాయి. ఇన్నాళ్లూ ఇదంతా కేవలం సోషల్ మీడియా రూమర్స్ అనుకున్నప్పటికీ, తాజాగా ప్రముఖుల అధికారిక ఆహ్వానాలతో ఈ విషయం కన్ఫర్మ్ అయింది. సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ దంపతులు నేరుగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి తమ కూతురి పెళ్లికి ఆహ్వానించడం సంచలనంగా మారింది. ఇన్నాళ్లూ వీరిద్దరి పెళ్లిపై రకరకాల ఊహాగానాలు వచ్చినా ఎవరూ అధికారికంగా స్పందించలేదు. కేవలం రూమర్స్ అని కొట్టిపారేశారు. కానీ ఇప్పుడెట్టకేలకు పెద్దలే స్వయంగా రంగంలోకి దిగి పెళ్లి పత్రికలు ఇస్తున్నారు. నవంబర్ 11న గ్రీస్‌లో అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరగనుండగా, నవంబర్ 21న చెన్నైలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించనున్నారు.

రజినీ 'ధర్మన్'లోకి నయనతార!

సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులతో ఫుల్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. తాజాగా ఆయన 'జైలర్-2'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'జైలర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ 'జైలర్-2' కూడా ప్రజెంట్ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుని ప్రశంసలు అందుకుంటుంది. ప్రజెంట్ ఈ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న రజినీకాంత్.. త్వరలో 'ధర్మన్'తో రాబోతున్నాడు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్ని కమల్ హాసన్ తన సొంత బ్యానర్ అయిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్‌నేషనల్' బ్యానర్‌పై నిర్మిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్‌తో భారీ హైప్ క్రియేట్ కాగా.. తాజాగా మరో క్రేజీ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది.





రౌడీ జనార్ధన.. క్యూట్‌గా కీర్తి


రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నటిస్తున్న క్రేజీ మూవీ 'రౌడీ జనార్ధన'. స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రవికిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపొందుతోన్న ఈ సినిమా నుంచి తాజాగా కీర్తి సురేష్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ రోజు హీరోయిన్ కీర్తి సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విశెస్ చెబుతూ "రౌడీ జనార్ధన" సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో కీర్తి సురేష్ ట్రెడిషనల్ లుక్‌లో బ్యూటిఫుల్‌గా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. అలాగే బ్యాక్ గ్రౌంట్ లుక్ సినిమాలో ఉండే లవ్ యాంగిల్‌ను ఎంతో క్యూరియాసిటీగా ప్రజెంట్ చేస్తుంది. భారీ అంచనాలు ఉన్న ఈ మూవీ ఈ డిసెంబర్‌లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

అదే మా యంగ్ లుక్ రహస్యం: సైఫ్, కరీనా



వయసు మీద పడుతున్నా ఇప్పటికీ యవ్వనంగా, తాజాగా కనిపించడానికి గల రహస్యం ఏమిటని కరీనా కపూర్,సైఫ్ అలీఖాన్‌ను అడగ్గా.. దానికి కారణం దేశీ నెయ్యి అని సైఫ్ చెప్పారు. తమ ఇంట్లో నెయ్యి తప్పనిసరిగా ఉంటుందని, తమ పిల్లలు తైమూర్, జెహ్ కూడా రోజూ నెయ్యి తింటారని కరీనా తెలిపారు. దీనికి సైఫ్ ఇంకొంత జోడిస్తూ, "ఆమె నెయ్యి తినడమే కాదు, రాత్రిపూట పాదాలకు కూడా రాసుకుంటుంది" అని చెప్పగా, అది నిజమేనని, అలా చేయడం వల్ల చాలా మేలు జరుగుతుందని కరీనా అంగీకరించారు.

మార్ఫింగ్ కంటెంట్ తొలగించండి



కొందరు తన ప్రమేయం లేకుండానే తన ముఖాన్ని, రూపాన్ని ఉపయోగిస్తూ ఏఐ ద్వారా నకిలీ వీడియోలు, చిత్రాలను సృష్టిస్తున్నారంటూ ట్విట్టర్ వేదికగా నేహా శర్మ సంచలన పోస్ట్ పెట్టారు. సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ మార్ఫింగ్, ఫేక్ కంటెంట్‌పై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన అనుమతి లేకుండా తన ఫేస్ లేదా రూపాన్ని ఉపయోగించి ఏఐ ద్వారా కంటెంట్ క్రియేట్ చేస్తున్న వారు వెంటనే ఆ పనిని ఆపేయాలని హెచ్చరించారు. ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అటువంటి ఫేక్ వీడియోలు, చిత్రాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. తన గుర్తింపును ఇలా దుర్వినియోగం చేస్తూ తనను తప్పుగా చిత్రీకరించడం, ప్రతిష్టకు భంగం కలిగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. దీనిని ఒక అధికారిక హెచ్చరికగా పరిగణించాలని ఆమె తేల్చి చెప్పారు. అంతేకాకుండా, నకిలీ ఖాతాల వెనుక దాక్కున్నా లేదా ఏఐ టెక్నాలజీని ఉపయోగించినా బాధ్యులు శిక్ష నుంచి తప్పించుకోలేరని నేహా శర్మ హెచ్చరించారు. ఈ విధమైన కంటెంట్‌ను తయారు చేసినా, పోస్ట్ చేసినా లేదా సోషల్ మీడియాలో ప్రచారం చేసినా సరే ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బాధ్యులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది.



స్విస్ టూరిజం అంబాసిడర్‌గా
జెమీమా రోడ్రిగ్స్

భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ ప్లేయర్ జెమీమా రోడ్రిగ్స్‌కు అరుదైన గౌరవం దక్కింది. స్విట్జర్లాండ్ టూరిజం సంస్థ ఆమెను తమ 'ఫ్రెండ్‌షిప్ అంబాసిడర్ ఫర్ ఇండియా'గా నియమించింది. భారత్ నుంచి, ముఖ్యంగా యువ ప్రయాణికులను స్విట్జర్లాండ్‌కు అధిక సంఖ్యలో ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం కుదుర్చుకుంది. అక్టోబర్ 15న బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో స్విట్జర్లాండ్ టూరిజం సీఈఓ మార్టిన్ నైడెగ్గర్ సమక్షంలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ ఒప్పందం ప్రకారం.. జెమీమా స్విట్జర్లాండ్‌లోని నాలుగు కాలాల్లో పర్యటించి, అక్కడి అనుభవాలను భారతీయులతో పంచుకోనుంది. కేవలం ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలే కాకుండా అంతగా ప్రాచుర్యం లేని కొత్త ప్రాంతాలు, స్థానిక సంస్కృతి, సాహస క్రీడలు వంటి వాటిని కూడా ఆమె తన పర్యటనలో ప్రమోట్ చేయనుంది. స్విట్జర్లాండ్‌కు అత్యధికంగా పర్యాటకులను పంపే టాప్ 10 దేశాల్లో భారత్ ఒకటిగా ఉండటంతో ఈ బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని స్విస్ టూరిజం భావిస్తోంది. 'ట్రావెల్ బెటర్' అనే తమ ఫిలాసఫీకి అనుగుణంగా, తక్కువ రోజుల్లో ఎక్కువ ప్రదేశాలు కాకుండా, ఒకే ప్రాంతంలో ఎక్కువ రోజులు ఉండి సంపూర్ణంగా ఆస్వాదించే ప్రయాణాలను ప్రోత్సహించడం కూడా ఈ ప్రచారంలో భాగం. ఈ నియామకంపై జెమీమా రోడ్రిగ్స్ మాట్లాడుతూ.. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం నాకు ఎంతో ప్రత్యేకం. నేను ఎక్కడికి వెళ్లినా నా దేశాన్ని నాతో పాటు తీసుకెళతాను. మనకు తెలిసిన స్విట్జర్లాండ్‌కు మించి, అక్కడి కొత్త విషయాలు, ప్రదేశాలను కనుగొనే అవకాశం రావడం నాకు ఎంతో ఉత్సాహాన్నిస్తోంది. అక్కడి ప్రజలను కలవడం, కొత్త అనుభవాలను పొందడం, ఆ క్షణాలను తిరిగి మన దేశ ప్రజలతో పంచుకోవడం కోసం ఎదురుచూస్తున్నాను" అని తెలిపింది.

జైస్వాల్‌కు అన్యాయం: అశ్విన్



భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను న్యూజిలాండ్ పర్యటనకు వన్డే జట్టు నుంచి తప్పించడంపై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సెలక్టర్ల నిర్ణయం అన్యాయమని, దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ సెలక్షన్ కమిటీ తీరును తప్పుబట్టారు. న్యూజిలాండ్ పర్యటనలో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా చివరి రెండు మ్యాచ్‌లకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతినిచ్చారు. ఈ నేపథ్యంలో గిల్ స్థానంలో యశస్వి జైస్వాల్‌కు అవకాశం ఇచ్చి ఉండాల్సిందని అశ్విన్ వాదించారు. "శుభ్‌మన్ గిల్ చివరి రెండు వన్డేలు ఆడకపోతే, ఆ స్థానం కచ్చితంగా యశస్వి జైస్వాల్‌కు దక్కాలి. ఇలా జరగడం చాలా దురదృష్టకరం" అని అశ్విన్ పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా జైస్వాల్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఏ ఫార్మాట్‌లోనూ మ్యాచ్ ఆడలేదని అశ్విన్ గుర్తుచేశారు.

భారత బౌలర్లూ మనుషులే: మోర్కెల్

భారత బౌలర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వారికి అండగా నిలిచాడు. ప్రతి మ్యాచ్‌లోనూ బౌలర్లు అత్యుత్తమ ప్రదర్శన చేయాలని ఆశించడం సరికాదన్నాడు. వరుస సిరీస్‌లు, ప్రయాణాలతో ఆటగాళ్లు మానసికంగా అలసిపోతున్నారని గుర్తుచేశాడు. వారి ప్రదర్శనను అంచనా వేసేటప్పుడు ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం బెంగళూరులో ఐదో టీ20కి ముందు మోర్కెల్ మీడియాతో మాట్లాడాడు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి విషయాన్ని తాను చదువుతానని చెప్పాడు. ఆటగాళ్ల మానసిక అలసటను చాలాసార్లు విస్మరిస్తున్నామని పేర్కొన్నాడు. భారత ఆటగాళ్లు ద్వైపాక్షిక సిరీస్‌లు, ఆసియా క్రీడలు, ఇతర కార్యక్రమాలతో బిజీగా గడుపుతున్నారని మోర్కెల్ వివరించాడు. ఆసియా క్రీడల్లో పాల్గొన్న కొందరు ఆటగాళ్లు నేరుగా వెస్టిండీస్ సిరీస్‌కు వచ్చారని చెప్పాడు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లి తిరిగి మ్యాచ్‌లకు సిద్ధమయ్యారని గుర్తుచేశాడు. సరిగ్గా నిద్రపోయి, శారీరకంగా కోలుకుని, మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే ఆటగాళ్లు తమ నైపుణ్యాలను మెరుగ్గా ప్రదర్శించగలరని అన్నాడు.



వాన దెబ్బ..!
ఐదో టీ20 రద్దు.. 2-2తో ముగిసిన సిరీస్

భారత్, వెస్టిండీస్ మధ్య జరగాల్సిన నిర్ణయాత్మక ఐదో టీ20 మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడ్డాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే రద్దయింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగిసింది. వర్షం అంతరాయం మధ్య కాసేపు సాగిన ఆటలో భారత బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించినా, చివరకు వరుణుడిదే పైచేయి అయింది.

వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (6), సంజు శాంసన్ (16) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యారు. ఇషాన్ కిషన్ (10 బంతుల్లో 30) మెరుపు దాడి చేశాడు. ఇషాన్ తన ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో అలరించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (14 బంతుల్లో 22) కూడా ధాటిగా ఆడడంతో స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. భారత ఇన్నింగ్స్‌లో 7.4 ఓవర్ల వద్ద తిలక్ వర్మ (7) ఐదో వికెట్‌గా ఔటైన వెంటనే వర్షం మళ్లీ మొదలైంది. అప్పటికి జట్టు స్కోరు 118 పరుగులు. అంతకుముందు క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ కేవలం 6 బంతుల్లోనే ఒక ఫోర్, మూడు సిక్సర్లతో 24 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. విండీస్ బౌలర్లలో కీమో పాల్, షమార్ స్ప్రింగర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. వర్షం ఎంతకీ తెరిపివ్వకపోవడంతో, మైదానాన్ని సిద్ధం చేసేందుకు సిబ్బంది ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అంపైర్లు ఇరుజట్ల కెప్టెన్లతో చర్చించి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. హోరాహోరీగా సాగుతుందని భావించిన సిరీస్ డిసైడర్ మ్యాచ్ ఇలా ముగియడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అనంతరం ఇరు జట్లు ట్రోఫీని పంచుకున్నాయి.





ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులకు బీసీసీఐ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించిన వేలం తేదీని, వేదికను బోర్డు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వేలం ప్రక్రియ డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనుంది. ఈ మేరకు మొత్తం 10 ఐపీఎల్ ఫ్రాంచైజీలకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నుంచి శనివారం సమాచారం అందినట్లు తెలుస్తోంది. గోవాలోని ఐటీసీ గ్రాండ్ హోటల్ ఈ వేలానికి ఆతిథ్యం ఇవ్వనుంది. వేలానికి ఒక రోజు ముందు, అంటే డిసెంబర్ 15న ఫ్రాంచైజీల ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా బ్రీఫింగ్ సెషన్ నిర్వహించనున్నారు. బీసీసీఐ లాజిస్టిక్స్ బృందం ఇప్పటికే వాట్సాప్ సందేశం ద్వారా ఫ్రాంచైజీలకు ప్రాథమిక సమాచారం అందించగా, దీనిపై అధికారికంగా ఈ-మెయిల్ ద్వారా ధ్రువీకరణ రావాల్సి ఉంది. గత మూడు సీజన్లుగా ఐపీఎల్ వేలం విదేశీ గడ్డపైనే నిర్వహించారు. 2024 సీజన్ కు దుబాయ్, 2025 సీజన్ కు జెడ్డా, 2026 సీజన్ కు అబుదాబి నగరాలు ఈ వేలానికి ఆతిథ్యమిచ్చాయి. ఈ క్రమంలో మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్ వేలం తిరిగి భారత్‌లో జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్రాంచైజీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న బోర్డు, ఈసారి స్వదేశంలోనే వేలం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వంటి అధికారులు డిసెంబర్ మధ్యలో గోవాలో వేలం జరపవచ్చని సంకేతాలిచ్చారు.

ముంబైకి జయవర్ధనే గుడ్‌బై!



ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ జట్టు హెడ్ కోచ్ మహేల జయవర్ధనేతో తన అనుబంధాన్ని ముగించుకుంది. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నాయి. 2026 సీజన్‌లో జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో వచ్చే సీజన్‌కు కొత్త కోచ్‌ను నియమించేందుకు ఫ్రాంచైజీ సిద్ధమవుతోంది. 2026 ఐపీఎల్ సీజన్ ముంబై ఇండియన్స్‌కు నిరాశనే మిగిల్చింది. ఆ సీజన్‌లో జట్టు కేవలం నాలుగు విజయాలకే పరిమితమైంది. ఆటగాళ్ల గాయాలు, అందుబాటులో లేకపోవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు ఉన్నాయన్న వార్తలు జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. కొత్త హెడ్ కోచ్ ఎంపిక కోసం ఫ్రాంచైజీ ఇప్పటికే పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. వచ్చే వారంలో అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశం ఉంది. జయవర్ధనే ముంబై ఇండియన్స్‌లో మరో బాధ్యతలో కొనసాగే అవకాశం లేదని తెలుస్తోంది. ముంబైతో జయవర్ధనే ప్రయాణం 2017లో ప్రారంభమైంది. ఆయన కోచింగ్‌లో జట్టు 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు సాధించింది. ముఖ్యంగా 2019, 2020లో వరుసగా ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో ఫ్రాంచైజీ చరిత్రలో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరిగా జయవర్ధనే గుర్తింపు పొందాడు. 2022 నుంచి 2024 వరకు ముంబై ఇండియన్స్ గ్లోబల్ హెడ్ ఆఫ్ పెర్ఫార్మెన్స్‌గా వ్యవహరించిన అతడు.. కోచింగ్, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహరచన వంటి బాధ్యతలను పర్యవేక్షించాడు.

ఢిల్లీకి కొత్త గ్యాంగ్!
గంగూలీ, యువరాజ్, వాస్‌తో కోచింగ్ టీం పటిష్ఠం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) జట్టు, రాబోయే సీజన్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ క్రమంలో తమ కోచింగ్ సిబ్బందిని పూర్తిగా ప్రక్షాళన చేసింది. భారత క్రికెట్ దిగ్గజాలతో కూడిన శక్తిమంతమైన కోచింగ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని హెడ్ కోచ్‌గా నియమించగా, విధ్వంసకర ఆల్-రౌండర్ యువరాజ్ సింగ్ బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. తాజాగా శ్రీలంక ఫాస్ట్ బౌలింగ్ దిగ్గజం చమిందా వాస్‌ను ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా నియమిస్తూ ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకుంది. చమిందా వాస్‌కు కోచ్‌గా విశేష అనుభవం ఉంది. గతంలో ఆయన శ్రీలంక జాతీయ జట్టుకు, ఎస్ఎల్‌సీ అకాడమీకి పలుమార్లు కోచ్‌గా పనిచేశారు. న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లకు



కన్సల్టెంట్‌గా కూడా సేవలందించారు. ఆయనతో పాటు ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరైన భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా కూడా డీసీ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా చేరనున్నట్లు సమాచారం. గతేడాది అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన మిశ్రాకు ఇదే తొలి కోచింగ్ బాధ్యత కానుంది. ఇప్పటికే జేఎస్‌డబ్ల్యూ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న సౌరవ్ గంగూలీ, ఇప్పుడు హెడ్ కోచ్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ ఏడాది దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్‌కు హెడ్ కోచ్‌గా పనిచేసి కోచింగ్‌లో అడుగుపెట్టారు. ఇక, యువరాజ్ సింగ్ తన అనుభవాన్ని శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, రిషబ్ పంత్ వంటి యువ ఆటగాళ్లకు మెంటార్‌గా పంచుకున్న విషయం తెలిసిందే. కోచింగ్ మార్పులతో పాటు జట్టులోనూ కీలక పరిణామం చోటుచేసుకుంది. లక్నో సూపర్ జెయింట్స్ నుంచి మాజీ కెప్టెన్ రిషబ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ట్రేడింగ్ ద్వారా తిరిగి దక్కించుకుంది. అతడికి బదులుగా స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను లక్నోకు బదిలీ చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆరో స్థానంతో సరిపెట్టుకున్న ఢిల్లీ జట్టు, ప్రస్తుతం అక్షర్ పటేల్ కెప్టెన్‌గా ఉంది. ఈ కొత్త బృందంతోనైనా తొలి ఐపీఎల్ టైటిల్ సాధించాలని పట్టుదలగా ఉంది. ఈ మేరకు గంగూలీ, యువరాజ్, వాస్‌ల పర్యవేక్షణలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో బెంగళూరు, ఢిల్లీలలో ట్రయల్స్ కూడా నిర్వహించారు.

ఈవార్తలు
ప్రజావాణి
ఆదివారం 18-10-2026, జగిత్యాల
www.evarthalu.com
ఈవార్తలు 12



పైసలన్నీ... అమ్ముకుంటున్నరు!

(అంతర్జాల అంగడి.. ఆఫర్లతో ఆర్థిక దోపిడీ)

ఆఫర్ల వలలో ఆశలు..
ఆన్‌లైన్ వేటలో జేబులకు కోతలు..
రాయితీలో రాలిపోతున్న రూపాయలు..
కొనుగోలు మోజులో కరిగిపోతున్న పొదుపులు..

ఫోన్లలో మోగే ఆఫర్ల గంటలు..
తెరల మీద మెరిసే డిస్కౌంట్లు..
దుకాణాల్లో రాయితీల వల..
అంతర్జాల వేదికల్లో అమ్మకాల గోల..
ఒకటి కొంటే మరొకటి ఉచితం..
రూ.వెయ్యి వస్తువుపై వందల రాయితీ..
కొద్దిగంటలే మిగిలాయంటూ ప్రకటనలు!
కొనకపోతే నష్టపోతామన్న భ్రమ..
కొంటేనే పండుగ అన్న భ్రమ..
ఖర్చు చేస్తేనే సంతోషమన్న భ్రమ..
పైసలు పోతేనే పరువన్న భ్రమ..
కొన్నాక జేబు ఖాళీ.. ఖాతా ఖాళీ..!

వస్తువుల్ని కొంటున్నామనుకుంటున్నం..!
ఆఫర్ల మోజులో పైసలనే అమ్ముకుంటున్నం..!!

ఒకప్పుడు పండుగొస్తే ఇంట్లో ఏ సందడి ఉండేది. ఇప్పుడు ఫోన్లో షాపింగ్ సందడి పెరిగింది. గతంలో పండుగకు ఏం కావాలో ఇంట్లో పెద్దలు ఆలోచించేవారు. ఇప్పుడు ఏం కొనాలో అంతర్జాల ప్రకటనలు చెబుతున్నాయి. అవసరాన్ని బట్టి కొనుగోలు చేసే రోజులు పోయి.. ఆఫర్‌ను బట్టి అవసరాన్ని సృష్టించుకునే రోజులు వచ్చాయి. ఇంట్లో పనిచేస్తున్న ఫోన్ ఉన్నా కొత్త దానిపై కన్ను.. అల్మారాలో బట్టలున్నా మరో జతపై మనసు.. వంటింట్లో సామగ్రి ఉన్నా కొత్తది కొనాలన్న కోరిక.. ఇంట్లో ఉన్నవి చాలవా అన్న ప్రశ్నకు చోటేది? కొత్తగా వచ్చినవి కావాలన్న కోరికకు అడ్డేది? ఆఖరికి కొనుగోలు చేయని రోజే వృథా అన్నట్లు దుస్థితి.



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్బీ
9581291919, 9441291919

వ్యాపారులకు అమ్మకాలే అసలైన పండుగ. వినియోగదారులకు మాత్రం అది ఖర్చుల దండగ కాకూడదు. కానీ రాయితీల రంగుల ప్రపంచంలో ఈ తేడా మసకబారుతోంది. ముందుగా వస్తువుపై ఆశ పుట్టిస్తారు. ఆ తర్వాత ధర తగ్గించామంటారు. కొనకపోతే అవకాశం చేజారిపోతుందని ఊరిస్తారు. మరికొన్ని గంటల్లో ఆఫర్ ముగుస్తుందని తొందరపెడతారు. ఒకటి కొంటే ఇంకొకటి తక్కువ ధరకు ఇస్తామంటారు. అవసరం లేని వస్తువునూ అవసరమైనట్టుగా చూపిస్తారు. చివరకు మనం కొనాల్సిన వస్తువుతోపాటు కొనకూడని నాలుగైదు వస్తువులనూ బుట్టలో వేసుకుంటాం. ఇదే ఆఫర్ల అసలు మాయాజాలం. ధర తగ్గిందని సంతోషపడతాం.. ఖర్చు పెరిగిందని గమనించం. ఆదా చేశామన్న ఆనందంలో ఖర్చు చేసిన మొత్తాన్ని మరిచిపోతాం. ఉదాహరణకు ఐదు వేల రూపాయల వస్తువును మూడున్నర వేలకే ఇస్తున్నారని అనుకుందాం. రూ.1,500 ఆదా చేశామని సంబరపడతాం. కానీ ఆ వస్తువు అవసరమే లేకపోతే ఆదా చేసినదెక్కడ? ఖర్చు చేసిన రూ.3,500 సంగతేంటి? కొనకపోతే ఆ డబ్బు మన దగ్గరే ఉండేది కదా! అవసరం లేని వస్తువుపై వెయ్యి రూపాయల రాయితీ.. మన జేబుకు మూడువేల ఖర్చు. ఇదొక లెక్కల మాయ. తగ్గిన ధరను లాభంగా చూపించి.. చేసిన ఖర్చును మన కళ్లకు కనిపించకుండా చేస్తుంది. పది శాతం రాయితీనా.. యాభై శాతం తగ్గింపా.. అన్నది కాదు ముఖ్యం. ఆ వస్తువు మనకు అవసరమా కాదా అన్నదే అసలు ప్రశ్న. కొనకపోతే మిగిలే డబ్బే నిజమైన ఆదా.

అంతర్జాల కొనుగోళ్లలో మరో విచిత్రం ఉంది. దుకాణానికి వెళ్తే జేబులోని డబ్బు గుర్తుకొస్తుంది. చేతిలోని నోట్లను లెక్కపెట్టాల్సి వస్తుంది. ధర ఎక్కువగా అనిపిస్తే వెనక్కి తగ్గే అవకాశం ఉంటుంది. కానీ ఫోన్లో కొనుగోలు చేసేటప్పుడు ఆ అనుభవమే వేరు. తెరపై వస్తువు కనిపిస్తుంది.. పక్కనే రాయితీ మెరుస్తుంది.. కింద కొనుగోలు గుర్తు కనిపిస్తుంది. ఒక్కసారి నొక్కితే చాలు.. వస్తువు ఇంటికి వచ్చేస్తుంది. డబ్బు మాత్రం ఖాతా నుంచి వెళ్లిపోతుంది. చేతిలో నగదు ఇచ్చిన బాధ ఉండదు.. ఖర్చు చేసిన భారం వెంటనే తెలియదు. కానీ నెలాఖరులో ఖాతా చూసినప్పుడు అసలు కథ బయటపడుతుంది. ఉదయం చూసిన ఆఫర్ మధ్యాహ్నానికి కొనుగోలుగా మారుతుంది. మధ్యాహ్నం వచ్చిన పార్శిల్ సాయంత్రానికి మరో వస్తువు కొనాలన్న కోరికను పెంచుతుంది. ఒక వస్తువు కోసం అంతర్జాల వేదికలోకి వెళ్లినవారు సిఫారసు చేసిన వస్తువులు చూస్తూ మరికొన్ని ఎంచుకుంటారు. కొనుగోలు పూర్తయ్యాక కూడా మరో ఆఫర్ ఎదురవుతుంది. అంటే షాపింగ్ ముగిసిందనుకునేలోపే కొత్త షాపింగ్‌కు తెరలేస్తుంది. అవసరాల జాబితా చిన్నదే.. కొనుగోళ్ల బుట్ట మాత్రం కొండంత..! పైగా సామాజిక మాధ్యమాల్లో ఇతరులు కొన్న కొత్త ఫోన్లు, దుస్తులు, గృహోపకరణాలు కనిపిస్తుంటాయి. వాటిని చూసి మన దగ్గరున్న వస్తువులు పాతవిగా అనిపిస్తాయి. ఇతరుల ఆనందాన్ని చూసి మనకూ కొనాలనిపిస్తుంది. మన అవసరంతో సంబంధం లేకుండా ఇతరుల కొనుగోలే మన కోరికకు కొలమానమవుతుంది. వారి చేతిలో కొత్త ఫోన్ ఉందని మనమూ కొనాలి.. వారి ఇంట్లో కొత్త పరికరం ఉందని మనమూ తెచ్చుకోవాలి.. వారు ఖరీదైన దుస్తులు వేసుకున్నారని మనమూ కొనాలి! ఇలా పోలికల పోటీలో పైసలన్నీ పలాయనం అంటున్నాయ్.

పొదుపు చేయాలంటే పెద్ద మొత్తమే ఉండాలనుకోవడం మరో పొరపాటు. చిన్న మొత్తమైనా క్రమం తప్పకుండా దాచుకుంటే అది అవసరమైనప్పుడు అండగా నిలుస్తుంది. అందుకే పండుగ ఖర్చులకు ముందుగానే పరిమితి పెట్టుకోవాలి. కొనాల్సిన వస్తువుల జాబితా తయారు చేసుకోవాలి. ఒకే వస్తువు ధరను వేర్వేరు దుకాణాల్లో పోల్చాలి. రాయితీ శాతాన్ని కాకుండా తుది ధరను చూడాలి. వస్తువు నాణ్యత, మన్నిక, నిజమైన అవసరాన్ని బేరీజు వేసుకోవాలి. కొనాలనే కోరిక కలిగిన వెంటనే డబ్బు చెల్లించకుండా కొంత సమయం ఆలోచించాలి. అప్పు చేయాల్సి వస్తే ఆ వస్తువు నిజంగా అవసరమా అని మరోసారి ప్రశ్నించుకోవాలి. ప్రభుత్వాలు, వినియోగదారుల సంఘాలు కూడా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచాలి. రాయితీల ప్రకటనల్లో ధరల వివరాలు పారదర్శకంగా ఉండేలా చూడాలి. తప్పుదారి పట్టించే ప్రచారాలపై నిఘా పెట్టాలి. అయితే మన ఖర్చుపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది మనమే. వ్యాపారి అమ్మాలనుకుంటాడు.. ప్రకటన ఆకర్షించాలనుకుంటుంది.. ఆఫర్ ఆశ పెట్టాలనుకుంటుంది. కానీ మన ఆదాయం, మన అవసరాలు, మన భవిష్యత్తు బాధ్యతలు మనకంటే బాగా మరెవరికి తెలుస్తాయి?

పండుగలు ఏటా వస్తాయి..
ఆఫర్లూ వస్తుంటాయి..
ఈ రోజు కొనని వస్తువు రేపూ దొరుకుతుంది..
ఈ రోజు కొనాలన్న కోరిక రేపూ తీర్చుకోవచ్చు..
కానీ, ఖర్చు చేసిన డబ్బు తిరిగి వస్తుందా..??
ఆఫర్ కనిపించగానే ఆశపడొద్దు..
కొనుగోలు గుర్తు కనిపించగానే క్లిక్ కొట్టొద్దు..



ఉద్యోగి జీతం కోసం ఎదురుచూస్తాడు. కార్మికుడు రోజువారీ కూలీతో కుటుంబాన్ని నెట్టుకొస్తాడు. రైతు పంట చేతికొస్తే అప్పులు తీర్చి, ఇంటి ఖర్చులకు కొంత దాచుకోవాలని చూస్తాడు. చిన్న వ్యాపారి వచ్చిన ఆదాయంలో కొంత పక్కనపెట్టాలని అనుకుంటాడు. కానీ చేతికి డబ్బు రాగానే అవసరాలతోపాటు ఆశలూ వరుస కడతాయి.

పండుగ ఆఫర్లు ఆ ఆశలకు ఆజ్యం పోస్తాయి. కొనుగోళ్ల మీద కొనుగోళ్లు.. ఖర్చుల మీద ఖర్చులు.. చివరకు నెల గడవకముందే డబ్బు గడువు ముగుస్తుంది. జీతం వచ్చిన రోజు జేబు నిండుగా ఉంటుంది. ఆఫర్లు చూసిన రోజు కొనుగోళ్లు నిండుగా ఉంటాయి. నెలాఖరుకు మాత్రం ఖాతా ఖాళీగా ఉంటుంది. సంపాదన పెరిగిందా లేదా అన్నది పక్కనపెడితే.. ఖర్చు చేసే వేగం మాత్రం పెరుగుతోంది. ఆదాయం వచ్చిన దారికంటే ఖర్చు వెళ్లే దారి వెడల్పవుతోంది. పైసలు చేతిలో నిలవడం లేదు.. పొదుపు ఖాతాలో పెరగడం లేదు.. అవసరమైనప్పుడు అండగా నిలవడం లేదు. సామాన్య కుటుంబానికి పొదుపు అంటే విలాసం కాదు.. భవిష్యత్తుకు భరోసా. పిల్లల చదువులకు అండ.. అనారోగ్య సమయంలో ఆసరా.. ఇంటి అవసరాలకు ఊరట.. వ్యవసాయ పనులకు పెట్టుబడి. ప్రతి నెలా కొంత దాచుకోవాలని కుటుంబ సభ్యులు ఎన్నో కోరికలను వాయిదా వేస్తారు. చిన్నచిన్న ఖర్చులను తగ్గించుకుంటారు. అలాంటి కష్టార్జితాన్ని ఆఫర్ల మోజులో ఖర్చు చేస్తే రేపటి అవసరాలకు ఏముంటుంది? పండుగనాడు కొత్త వస్తువులు ఇంటికి వస్తాయి.. కానీ అత్యవసర సమయంలో డబ్బు లేకపోతే ఆ వస్తువులు ఆదుకుంటాయా? చేతిలో డబ్బు లేకున్నా కొనుగోలు చేయాలనే కోరిక తగ్గడం లేదు. అప్పు చేసి కొనడం.. నెలవారీ వాయిదాలతో ఖరీదైన వస్తువులు తెచ్చుకోవడం.. తక్షణ రుణాలతో కోరికలు తీర్చుకోవడం పెరుగుతోంది.

ఈ రోజు కొన్న వస్తువుకు రేపటి నుంచి వాయిదా కట్టాలి. ఈ రోజు వచ్చిన ఆనందానికి రాబోయే నెలల్లో ఖర్చు చెల్లించాలి. వస్తువు ఇంటికి వస్తుంది.. అప్పు భుజానికి ఎక్కుతుంది! పండుగ సంతోషం కొద్దిరోజులే.. వాయిదాల భారం నెలల తరబడి!

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.